ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శుక్రవారం 5 సెప్టెంబరు 2025



స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- 12న అమరావతిలో అఖిలపక్షాలతో రౌండ్‌టేబుల్ సమావేశం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

... మెయిన్‌లో



జలాశయాలు కళకళ

నిండుకుండల్లా రిజర్వాయర్లు

ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా చేరిన నీరు

- దాదాపు అన్ని రిజర్వాయర్లలోనూ గరిష్ఠ స్థాయికి సమీపంలో నీటిమట్టాలు
- ఏడాదిపాటు నగరంలో నీటి సరఫరాకు ఇబ్బందిలేనట్టే



ముడసర్లోవలో నీరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గత కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో రిజర్వాయర్లలో భారీగా నీరు చేరుతోంది. దాదాపు అన్ని రిజర్వాయర్లు గరిష్ఠ స్థాయికి చేరువలో ఉన్నాయి. రిజర్వాయర్లలో పుష్కలంగా నీరు చేరడంతో మరో ఏడాది వరకూ నగరానికి తాగునీటి ఇబ్బందులు ఉండవని జీవీఎంసీ అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.


రిజర్వాయర్లలో ప్రస్తుత నీటిమట్టాలు

రిజర్వాయర్	గరిష్ఠం	కనిష్ఠం	ప్రస్తుతం
ఏలేరు	86.56 మీటర్లు	68.8 మీటర్లు	81.16 మీటర్లు
రైవాడ	114 మీటర్లు	99 మీటర్లు	113.6 మీటర్లు
మేహాద్రిగెడ్డ	61 అడుగులు	44 అడుగులు	59.6 అడుగులు
తాటిపూడి	297 అడుగులు	151 అడుగులు	293.5 అడుగులు
ముడసర్లోవ	169 అడుగులు	152 అడుగులు	159.05 అడుగులు
గంభీరం	126 అడుగులు	117 అడుగులు	123 అడుగులు

నగరవాసుల అవసరాల కోసం జీవీఎంసీ ప్రతిరోజూ 79 ఎండీజీల నీటిని సరఫరా చేస్తోంది. అందులో 42 ఎంజీడీలు ఏలేరు రిజర్వాయర్ నుంచి, పది ఎంజీడీలు తాటిపూడి రిజర్వాయర్ నుంచి, 15 ఎంజీడీలు రైవాడ రిజర్వాయర్ నుంచి, ఎనిమిది ఎంజీడీలు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి, 0.5 ఎంజీడీలు చొప్పున ముడసర్లోవ, గంభీరం రిజర్వాయర్ల నుంచి సేకరిస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌తోపాటు తాటిపూడి, రైవాడ రిజర్వాయర్‌ల నుంచి సాగు అవసరాలకు కూడా నీటిని విడుదల చేయాల్సి ఉంటోంది. వేసవిలో రిజర్వాయర్‌లలో నీటిమట్టం అడుగంటినప్పటికీ సాగు అవసరాలకు మాత్రం ఇస్తుంటారు. దీంతో మార్చి నుంచి రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతుంటాయి. ఆ ప్రభావం నగరంలో నీటి సరఫరాపై పడుతోంది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు నగరంలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయడం, కొళాయిల ద్వారా నీటిని ఇచ్చే వ్యవధిని తగ్గించడం చేస్తుంటారు. ఇక, ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవడంతో రిజర్వాయర్లలో నీరు చేరలేదు. పైగా ఆగస్టు రెండో వారం వరకూ వేసవిని తలపించేలా ఎండలు ఉన్నాయి. మరోవైపు రిజర్వాయర్ల నుంచి నీటిని వ్యవసాయం కోసం ఎక్కువగా విడుదల చేయాల్సి వచ్చింది. దీంతో ఏలేరు, రైవాడ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి మట్టాలు కనిష్ఠ స్థాయికి చేరువయ్యాయి. ఇలాంటి తరుణంలో గత పది రోజులుగా పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో రిజర్వాయర్లలో వర్షం నీరు భారీగా చేరింది. ఏలేరు ... మిగతా 4వ పేజీలో

నేడు సీఎం రాక

ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు హాజరు



విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల శుక్రవారం నగరానికి రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. ఉదయం 7.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 8.50 గంటలకు రుషికొండ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి తొమ్మిది గంటలకు రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. ఉదయం పది నుంచి 11.30 గంటల వరకూ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 11.30 గంటలకు హోటల్ నుంచి తిరిగి రుషికొండ హెలిప్యాడ్‌కు చేరుకుని 11.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.

పెందుర్తిలో జె.కుమార్ ఇన్‌ఫ్రా

ప్రాజెక్టుకు మంత్రిమండలి పచ్చజెండా

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

అమరావతిలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో విశాఖ జిల్లాకు సంబంధించి కొన్ని ప్రాజెక్టులకు అనుమతించారు. పెందుర్తిలో జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు ఆమోదించారు. వీరు 63.37 ఎకరాల్లో ప్రాజెక్టు నిర్మిస్తారు. అందులో ఐదు వేల మందికి ఉపాధి లభించనుంది. అదే విధంగా భోగాపురం విమానాశ్రయం సమీపాన ఎన్‌కామ్ పేరుతో నాలుగు నక్షత్రాల హోటల్ నిర్మిస్తారు. ఇది తాజ్ వివంతా అనుబంధ సంస్థ. అందులో 250 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

ఇక ఆపండి


గాజువాకలో గణపతి ఉత్సవాల పేరిట భక్తులను దోచుకుంటున్న నిర్వాహకులకు చెక్

మూసివేతకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

- నిబంధనలను పదేపదే ఉల్లంఘించడంతోనే నిర్ణయం
- రాత్రికి రాత్రి దర్శనాలు, వ్యాపారాలు నిలిపివేత
- ఎట్టకేలకు స్పందించిన అధికారులు



పాత గాజువాకలో కోటి లింగాల గణపతి ప్రాంగణం



లంకా మైదానంలో చీకట్లు అలుముకున్న లక్ష చీరల గణపతి ప్రాంగణం

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

నగరంలో వినాయక చవితి ఉత్సవాల పేరుతో వ్యాపారం చేస్తున్న నిర్వాహకులకు ఎట్టకేలకు అధికారులు చెక్ పెట్టారు. గాజువాక లంకా మైదానంలో లక్ష చీరల గణపతి ఉత్సవాలను, పాత గాజువాకలో కోటి లింగాల గణపతి ఉత్సవాలను గురువారం రాత్రి నిలిపివేయించారు. ఈ రెండింటిపైనా ఆది నుంచి తీవ్రమైన ఆరోపణలు రావడమే కాకుండా అక్కడ పోలీసులు వద్దని చెప్పినా భక్తుల నుంచి దర్శనాలకు టికెట్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తూ వచ్చారు. పార్కింగ్ అని, అన్నదానం అని రకరకాలుగా దోచుకున్నారు. ఈ రెండుచోట్ల భక్తులతో వివాదాలు జరుగుతున్నాయి.

కోటి లింగాల తయారీకి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడారని, అది కాలుష్య కారకమని, ఓ చిన్నారి లీగల్ నోటీసు కూడా ఇచ్చింది. ఆ బాలిక తండ్రి అడిగిన మొత్తం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారంటూ నిర్వాహకులు తిరగబడ్డారు. ఆర్టీసీ ఫ్రీ బస్సుల్లో మహిళలు పెద్దఎత్తున దర్శనాలకు వస్తున్నారని, టికెట్లు తీసుకోవడం లేదంటూ లంకా మైదానంలో గణపతి ఉత్సవ నిర్వాహకులు బుధవారం ఘర్షణపడ్డారు. గాజువాక పోలీసులు కూడా వారికే వత్తాసు పలికారు. నిర్వాహకులకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, అధికారులు ఎవరూ జోక్యం చేసుకోవడానికి వీల్లేదని గాజువాక ఏసీపీ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. అయితే అవన్నీ అవాస్తవాలని తేలింది.

స్పందించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

గాజువాకలోని భారీ వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న రెండు కమిటీలు కూడా సింగిల్ విండో కింద జీవీఎంసీ ఇచ్చిన అనుమతుల్లో పేర్కొన్న నిబంధనలు పాటించలేదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గుర్తించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి ఫీజులు వసూలు చేయకుండా ఉత్సవాలు నిర్వహించాలని వాటిలో పేర్కొన్నారు. అయితే వాటిని నిర్వాహకులు పదే పదే ఉల్లంఘించడం, పోలీసులు చెప్పినా వినకపోవడంతో ఆయన స్పందించారు. గురువారం ... మిగతా 4వ పేజీలో

అధిక వడ్డీ ఆశ చూపి...

రూ.ఆరు కోట్లు కాజేసిన 'ఫెయిర్ గ్రో ట్రేడర్స్' నిర్వాహకులు

- ఏడాది కిందట ఎం.వి.పి.కాలనీలో సంస్థ ప్రారంభం
- రూ.లక్షకు రోజుకు వెయ్యి రూపాయలు ఇస్తామంటూ మోసం
- డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి అరెస్టు
- ప్రధాన నిందితుడిపై పన్నెండేళ్ల క్రిందట సస్పెక్ట్ షీటు
- తాజా దర్యాప్తులో వెల్లడి



ప్రధాన నిందితుడు నందకిషోర్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

అధిక వడ్డీ ఆశ చూపించి సుమారు రూ.ఆరు కోట్లు వసూలుచేసిన 'ఫెయిర్ గ్రో ట్రేడర్స్' నిర్వాహకులు ముగ్గురిని ఎంవీపీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అధిక వడ్డీ వస్తుందని మధ్య తరగతికి చెందిన పలువురు ఇందులో పెట్టుబడి పెట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణలో రూ.5.5 కోట్లు వసూలుచేసినట్టు తేలింది. అయితే ఈ సొమ్ము మరింత ఎక్కువే ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

నగరంలోని రెడ్నం గార్డెన్స్‌కు చెందిన నరమామిడి వెంకటపార్వతి నందకిషోర్ (58), భార్య రమణాంబ (56), కుమారుడు ప్రభునందన్ (31) కలిసి ఎంవీపీ కాలనీలో ఫెయిర్ గ్రో ట్రేడర్స్ అనే సంస్థను గత ఏడాది జూలైలో ప్రారంభించారు. రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడులు పెడతామని, అందులో అధిక లాభాలు సాధించి తమ వద్ద పెట్టుబడి పెట్టిన వారికి పంచుతామంటూ పరిచయం ఉన్న వారందరికీ చెప్పి డబ్బులు తీసుకున్నారు. రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రోజుకు రూ.వెయ్యి లాభం వస్తుందని నమ్మబలికారు. ఇలా పెట్టిన వారికి కొద్ది రోజుల పాటు రోజుకు రూ.వెయ్యి చొప్పున నెలకొకసారి చెల్లించారు. మొదట్లో రెండు, మూడు నెలలు ఇచ్చారు. ఆ తర్వాత చెక్కులు ఇచ్చి, సొమ్ము ఆలస్యంగా జమ అవుతుందని చెప్పుకుంటూ వచ్చారు. జనాల వద్ద తీసుకున్న డబ్బుతో ఒక డూప్లెక్స్ ఇల్లు, రెండు స్థలాలు, మరికొన్ని ఆస్తులు కొనుగోలు చేశారు. విలాసవంతమైన జీవనం గడపసాగారు. పేమెంట్స్ ఆగిపోవడంతో పెట్టుబడి పెట్టినవారు ఒత్తిడి చేయడం మొదలుపెట్టారు. భారీగా పెట్టుబడి పెట్టిన కొందరు వారి వద్ద ఉన్న ఆస్తులను రాయించుకున్నారు. ఒకటి, రెండు ఆస్తులను తాకట్టు పెట్టి, కొందరికి కొంతమేర సొమ్ములు చెల్లించారు. తర్వాత వ్యాపారం నడవకపోవడంతో ఎంవీపీ కాలనీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన గల నవరత్న ట్రేడ్ సెంటర్ భవనంలోకి కార్యాలయాన్ని మార్చారు. అక్కడ కూడా వ్యాపారం సాగకపోవడంతో సుమారు ఐదు ... మిగతా 4వ పేజీలో

నేటి నుంచి ఫుడ్ ఫెస్టివల్

- వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక ఖాళీ స్థలంలో సాయంత్రం 6 నుంచి 11 గంటల వరకూ...
- ఫిషింగ్ బోట్లలో డైనింగ్ ఏర్పాట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పర్యాటక అభివృద్ధి కోసం ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించడంతో విశాఖ జిల్లా అధికారులు 'వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్' నిర్వహణకు నడుం కట్టారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో వీఎంఆర్‌డీఏ పార్క్ వెనుక ఖాళీ స్థలంలో ఈ ఉత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ఫుడ్ స్టాల్స్ ఉంటాయి. పర్యాటక శాఖ, హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో సుమారు 45 స్టాళ్లు పెడుతున్నారు. ఇందులో స్టార్ హోటళ్లు కూడా పాల్గొంటున్నాయి. అందరికీ అందుబాటులో ధరలు పెట్టారు. పేరొందిన ఆంధ్రా వంటకాలు, ప్రపంచ రుచులు, సిగ్నేచర్ స్పెషల్ డిష్‌లు, ఇలా అనేకం ఉంటాయి.



వీఎంఆర్‌డీఏ పార్కు వెనుక ఫుడ్ ఫెస్టివల్ కోసం ఏర్పాటు చేస్తున్న స్టాళ్లు

కేటమరాన్ డైనింగ్ స్పెషల్

ఫెస్టివల్‌లో భాగంగా మత్స్యకారులు నడిపే బోట్లను తీసుకువచ్చి ఇసుక తిన్నెల్లో పెడుతున్నారు. వాటిని అందంగా అలకరించి వాటిలోనే కూర్చొని తినే సదుపాయం కల్పిస్తున్నారు. ఆర్డర్ చేసుకున్న ఫుడ్ అక్కడికే అందిస్తారు. బోటులో కూర్చొని తింటూ సముద్రాన్ని చూస్తూ ఎంజాయ్ చేయొచ్చు. దీనిని 'కేటమరాన్ డైనింగ్‌'గా వ్యవహరిస్తారని జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి తెలిపారు. ఇలాంటివి మొత్తం ఆరు బోట్లు ఉంటాయన్నారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. దీనికి ఎటువంటి ప్రవేశ రుసుము లేదు.

90 మంది ఉపాధ్యాయులకు అవార్డులు

గురు పూజోత్సవం సందర్భంగా జిల్లా విద్యా శాఖ ప్రకటన

నేడు ఏయూ అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో ప్రదానం



విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

గురు పూజోత్సవం సందర్భంగా జిల్లా విద్యా శాఖ 90 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించింది. వీరిలో ఎనిమిది మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐదుగురు ప్రిన్సిపాళ్లు, ఐదుగురు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, 50 మంది స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన ఉపాధ్యాయులు, 22 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. శుక్రవారం ఏయూ అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేస్తామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.

అవార్డుకు ఎంపికైన హెచ్‌ఎంలు/పని చేస్తున్న ప్రాంతం: కె.విజయప్రశాంతి (గాజువాక), సీహెచ్ చిన్మయ (పెందుర్తి), కె.శ్రీనివాసరావు (హెచ్.వెంకటాపురం), బి.అప్పలరాజు (బి.తాళ్లవలస), పి.నిర్మలాకుమారి (విజయానందపురం), ఎస్.అప్పారావు (యారాడ), మురళీకృష్ణ (బోని), పి.శాంతిప్రసన్న (మద్ది), కె.రామకృష్ణ (భీమిలి), ప్రిన్సిపాళ్లు: ఎల్.శివప్రసాద్ (మారికవలస), ఎం.కృష్ణ (పెదనరవ), సత్యవతి (మధురవాడ), కె.గ్రెస్‌లిల్లీ (భీమిలి), ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు: ఎల్.అప్పారావు (పాండ్రంగి), ఎం.కృపానందం (బక్కన్నపాలెం), వెంకటసంతోష్ (విల్లన్నపేట), అబ్దుల్‌హక్ (సింహగిరి కాలనీ), ఎస్‌బీ విజయకుమార్ (ఆర్‌జీకే కాలనీ, చినగదిలి), స్కూల్ అసిస్టెంట్లు/తత్సమాన కేటగిరీ: ఎస్.విజయకుమార్ (చిప్పాద), చింతల శారద, అక్కినేని శైలజ (క్వీన్‌మేరీస్), జి.ఎర్రయ్య (రేవిడి), జి.సూర్యకుమారి, జి.కనకమహాలక్ష్మి, పి.శ్రీకాంత్, ఎస్.ఆర్.రత్నవల్లి, పీవీకెఎం లక్ష్మి (చంద్రంపాలెం), కె.శ్రీను (చిన ఉప్పాడ), డి.సుభద్ర (పెదమంగవారిపేట), కె.జగన్నాథం (భీమిలి రెండో వార్డు స్కూలు), కె.స్వరూపరాణి (నెహ్రూ హైస్కూలు), బి.రామచంద్రనాయుడు (నడుపూరు), కె.సుమతి శివాని (ఎంవీడీఎం), జె.బాలరాజురెడ్డి (తాళ్లవలస), ఎ.రామలక్ష్మి (కేఏన్‌ఎం), ... మిగతా 4వ పేజీలో

నవంబరుకల్లా కంపెనీలకు భూములు

- గూగుల్ డేటా సెంటర్‌కు ఆనందపురం మండలంలో 200 ఎకరాలు
- రతన్‌టాటా హబ్ వినియోగంపై రోడ్ మ్యాప్
- రూ.560 కోట్లతో మురుగునీరు శుద్ధి
- కలెక్టర్ హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఏర్పాటుకానున్న ఐటీ, ఇతర అనుబంధ కంపెనీలకు నవంబరు నెలాఖరు నాటికి భూములు అప్పగిస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని సంస్థలకు భూములు ఇచ్చామన్నారు. అదానీ డేటా సెంటర్‌కు గతంలోనే మధురవాడలో భూములు కేటాయించగా, తాజాగా సిఫీ సంస్థకు పరదేశిపాలెంలో 25 ఎకరాలు ఇచ్చామన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కు ఆనందపురం మండలంలో 200 ఎకరాలు కేటాయిస్తామని, దీనికి సంబంధించి పూర్తి ... మిగతా 4వ పేజీలో



సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న నగర న్యాయమూర్తులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం

గోపాలపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పమిడిగంటం శ్రీనరసింహం, జస్టిస్ సూర్యకాంత్‌లు గురువారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. వారికి విమానాశ్రయంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిలతో పాటు పలువురు జిల్లా న్యాయమూర్తులు స్వాగతం పలికారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు శుక్రవారం నగరంలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

నగరాభివృద్ధికి స్టాండింగ్ కమిటీ కృషి చేయాలి

- కొత్తగా ఎన్నికైన కమిటీ తొలి సమావేశంలో మేయర్, కమిషనర్ పిలుపు
- 194 అంశాలకు ఆమోదం
- నాలుగు అంశాలు వాయిదా

-6లో

ఆనందపురంలో డీసీసీబీ శాఖ ప్రారంభం

ఆనందపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) 32వ శాఖను మండలంలోని ఆనందపురం గ్రామంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు డీసీసీబీ సేవలు మరింత చేరువ చేసేందుకు ఆనందపురం శాఖ మరింత తోడ్పడుతుందన్నారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా డ్వాక్రా మహిళలకు 75 పైసలకే రుణాలు మంజూరు అందజేస్తున్నామన్నారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు యువకులు ముందుకు వచ్చినట్టయితే రూ.రెండు కోట్ల వరకు రుణాలు అందించేందుకు డీసీసీబీ సిద్ధంగా ఉందన్నారు. ఈ బ్యాంకు సేవలు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డు సభ్యుడు పంచకర్ల సందీప్, శొంఠ్యాం, ఆనందపురం, వేములవలస సహకార సంఘాల అధ్యక్షులు గండ్రెడ్డి స్వామినాయుడు, పాండ్రంకి అప్పలరాజు, రౌతు నాగరాజు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, డీసీసీబీ బ్యాంకు అధికారులు డీసీవో ప్రవీణ్, ఎల్‌డీఎం ఎం.శ్రీనివాస్, డీవీఎస్ వర్మ, డెప్యూటీ రిజిస్ట్రార్ కిరణ్‌కుమారి, బ్రాంచి మేనేజర్ సీతానాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఎల్పీవో ఆకస్మిక తనిఖీ

ఆనందపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం, వెల్లంకి పంచాయతీల్లో డీఎల్పీవో ఉషారాణి గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆయా పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. తడి చెత్త నుంచి వర్మీ తయారీ విధానంపై సూచనలిచ్చారు. వర్మీ కంపోస్టుతో పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని, మార్కెట్ చేయడానికి సదుపాయాలు కల్పిస్తామని అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శి శ్రీరామ్మూర్తికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు అండగా నిలవాలి

» నూతన పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచన

ఆనందపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పదవులకు వన్నె తెచ్చేలా రైతుకు అండగా నిలబడి మేలు చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆనందపురం సమీపంలో ఉన్న ఆరెంజ్ కన్వెన్షన్ హాల్‌లో భీమిలీ నియోజకవర్గంలో కొత్తగా నియమితులైన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ దేశానికి వెన్నుముకైన రైతుకు ఆర్థిక సాయం అందించడం ప్రభుత్వానికి భారం కాదు బాధ్యత అన్నారు. ఆర్థికంగా ఆదుకుంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ రైతు కుటుంబాల్లో పెద్దన్న పాత్ర పోషించాలని సూచించారు. రైతుకు సేవ చేసే అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో ఏడు వేల రూపాయలు రైతు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. ఎరువుల లభ్యత విషయంలో ప్రభుత్వంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎరువుల షాపుల వద్ద లాఠీచార్జి జరిగిన సంగతి మర్చిపోయి విమర్శలు చేయడం 'గురివింద గింజ' చందాన్ని గుర్తు చేస్తోందన్నారు. మామిడి, పొగాకు గిట్టుబాటు ధల విషయాలను రాజకీయం చేయాలని చూసిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభాసుపాలయ్యారన్నారు. ఈ సందర్భంగా పాండ్రంకి అప్పలరాజు (ఆనందపురం), గండ్రెడ్డి స్వామినాయుడు (శొంఠ్యాం), రౌతు నాగరాజు (వేములవలస), మెకర అప్పలనాయుడు (పద్మనాభం), పోతిన ప్రసాద్ (మధురవాడ), బర్నాల సత్యశ్రీనివాస్ (పాండ్రంకి), జుత్తాడ గణేష్ (గంధవరం), గుడ్డాల ఎల్లయ్య (మజ్జివలస), కర్నీడి శ్రీరాములు (రెడ్డిపల్లి)లు పీఏసీఎస్ చైర్మన్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, సీఈవో వర్మ, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు పంచకర్ల సందీప్, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, నాయకులు బీఆర్బీ నాయుడు, నేతలు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, మీసాల సత్యనారాయణ, బమ్మిడి ఉమ, గాడు చిన్నికుమారి, అగరపు దేముడుబాబు, గండ్రెడ్డి రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ కోనతాతారావు తదితరులు

నవంబరుకల్లా కంపెనీలకు భూములు

... 3వ పేజీ తరువాయి

వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. డేటా సెంటర్లకు ఇండిపెండెంట్ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరాకు అవసరమైన లైన్లు అవసరమైనందున, అందుకు తగిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. వీఎంఆర్‌డీఏ డెక్ భవనంలో నెలకొల్పిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ హబ్‌ను సందర్శించనున్నారని అన్నారు. హబ్ పూర్తిస్థాయిలో పనిచేసేలా క్యాలెండర్ రూపొందిస్తామని ప్రకటించారు. ఏయూ, హైదరాబాద్ ఐఐటీ, గీతం వర్సిటీలతో ఇప్పటికే ఒప్పందాలు జరిగాయన్నారు. ఇక్కడ ప్రతి వారం ఒక ఈవెంట్ జరిగేలా షెడ్యూల్ డిజైన్ చేస్తామన్నారు. ఐటీ, వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్ చేనేత, చేతివృత్తులు, డ్వాక్రా మహిళలు...ఇలా ప్రతి రంగానికి చెందిన వ్యక్తులను పిలిచి ఆయా రంగాల్లో నిపుణులతో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. ఆయా రంగాల్లో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలపై చర్చించి మార్కెట్‌కు అనుకూలంగా వస్తు ఉత్పత్తులు చేసి అమ్మకాలు చేపట్టేలా సాంకేతికత సహకారం అందించడమే లక్ష్యమన్నారు. ఇంకా ఆయా రంగాల్లో సమస్యలు పరిష్కరించడానికి ఇదే హబ్‌లో హ్యాక్‌థాన్‌లు నిర్వహిస్తామన్నారు. నెలకు ఒక హ్యాక్‌థాన్ నిర్వహించేలా రోడ్‌మ్యాప్ ఖరారుచేస్తామన్నారు. రతన్‌టాటా హబ్‌కు ఇప్పటికే ఒకరిని సీఈవోగా నియమించామన్నారు.

నగరంలో కాలుష్యం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. తీరం పొడవునా మురుగునీరు సముద్రంలోకి వెళ్లకుండా శుద్ధి చేయడానికి తగిన కార్యాచరణ అమలుకు ప్రపంచబ్యాంకు నుంచి రూ.560 కోట్ల సాయం తీసుకుంటున్నామని అన్నారు. అప్పుఘర్‌లో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను మరింత మెరుగుపర్చుతామన్నారు. సాగర్‌నగర్ వద్ద ప్లాంటు ఏర్పాటుచేస్తామన్నారు. మధురవాడ ప్రాంతం నుంచి మురుగునీటిని మళ్లించి అక్కడ శుద్ధి చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఖరీఫ్‌లో 4,600 హెక్టార్లకుగాను ఇంతవరకూ 3,600 హెక్టార్లలో పంటలు వేశారన్నారు.

90 మంది ఉపాధ్యాయులకు అవార్డులు

... 3వ పేజీ తరువాయి

బి.అప్పలరాజు (లక్ష్మీపురం), బి.శ్రీను (మాధవధార), ఎ.వెంకటరమణ (కె.కాలనీ), పి.పద్మలత (పెదనరవ), సి.మత్స్యవరప్రసాద్ (గోపాలపట్నం), ఎస్.రామతులసి (రైల్వేకాలనీ), పి.శాంతికుమారి (ఎంటీపాలెం), ఎస్.లక్ష్మణరావు, జె.వివేకానంద (శ్రీకృష్ణాపురం), ఆర్.కీర్తి (భీమిలి కేజీబీవీ), కేటీఎస్ ప్రసాదిని (ఆనందపురం కేజీబీవీ), బి.దేవి (పద్మనాభం కేజీబీవీ), ఎ.రాజారమేష్ (శొంఠ్యాం), టీవీ రమణ (ఎండాడ), టి.లలితాశ్రీనివాస్ (బాలభవన్), కె.ప్రశాంతి (తర్లువాడ), పి.సుగుణావతి (గండిగుండం), ఎం.శంకరరావు (తోటగరువు), వీవీ రమాకుమారి (కణితి), కె.శ్రీనివాసరావు (యారాడ), కె.ఈశ్వరరావు (భీమిలి), కె.ఎర్రన్నాయుడు (సిర్లపాలెం), కె.శ్రీనివాసరావు, వి.ఆంజనేయులు (బి.తాళ్లవలస), మాలతి (గొట్టిపల్లి), ఎ.సత్యకళ, జి.వెంకటమురళి (అడవివరం), ఎం.పార్వతీదేవి (బోయపాలెం), కేవీఎస్ఎస్ఆర్ గుప్తా (ఆనందపురం), ఎ.వెంకటరమణ (శ్రీహరిపురం), టి.శ్రీశైలజ (వేములవలస), పీవీఎస్ నరసింహం (వేపగుంట), ఎం.దామోదర్ (సీతమ్మధార నెహ్రూ స్కూలు) ఉన్నారు. ఎస్జీటీ కేటగిరీలో జి.సంధ్యారాణి (ఆర్పేట), బి.హేమంత్‌కుమార్ (చేపలపాలెం), వై.రాణి (సాయిరామ్ కాలనీ), విఘ్నేశ్వరి (ఎండాడ), షేక్ రంజాన్ (మదీనాబాగ్), ఎం.సునీత (గాంధీనగర్), పి.లక్ష్మణ (తోటగరువు), కె.మురళి (తునిపాలెం), టి.జగన్నాథం (బుచ్చిరాజుపాలెం), షేక్ గౌసియాబేగం (ఎన్‌జీజీవో కాలనీ), బి.నిర్మల (దుగ్గవానిపాలెం), జి.హేమేశ్వరరావు (ఆరిలోవ), డి.సత్యనారాయణ (మింది), కె.సాయికృష్ణ (పెదగదిలి), కె.గంగాభవానీ (గొల్లలపాలెం), వి.రామారావు (యాతపేట), పి.అనుపమ (శివాజీపాలెం), డి.ఇందిరాప్రియదర్శిని (అగనంపూడి), ఇ.ప్రసాద్ (రామనగర్), టి.అలివేలుమంగ (వేపగుంట), ఎం.అనిపూర్ణిమ (సింహాచల నగర్).

వినాయక చవితి లడ్డూ వేలం

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం నగరపాలెంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో లడ్డూ వేలం వేశారు. ఈ వేలంపాటలో 5 కిలోల లడ్డూను బర్ల నర్సింగరావు రూ.5 వేలకు పాడుకున్నారు.

ఈ లడ్డూను భక్తులందరికీ ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువారం రెండువేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

కృష్ణమూర్తి దంపతులకు ఘన నివాళి

భీమునిపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి, స్వర్గీయ బొంతకోటి కృష్ణమూర్తి, రమణమ్మ దంపతులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానం ఎదురుగా ఉన్న ఒక రిసార్టులో కృష్ణమూర్తి సంవత్సరీకం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అర్చకులు రొంపిచెర్ల సింగరాచార్యులు, ప్రజా నాయకులు గుడివాడ నాగమణి, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, మైలపల్లి షణ్ముఖరావు, యరబాల అనిల్ ప్రసాద్, గాడు తాతినాయుడు, విశ్రాంత డాక్టర్ సోములు, బొంతలకోటి మధుసూదనరావు, బి.రామకృష్ణ, బి.వెంకటరమణ, పిరిడి సత్యనారాయణ, విజయలక్ష్మి, పద్మజ, రాజేశ్వరి, వాణి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



కృష్ణమూర్తి దంపతులకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గంటా

7న అనంతపద్మనాభుడి ఆలయం మూసివేత

పద్మనాభం-రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేయనున్నట్టు ఆలయ ఈవో నానాజీబాబు, ప్రధాన అర్చకుడు వీఎస్ఆర్‌ఏ స్వామి ఒకప్రకటనలో తెలిపారు. 7వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 12 గంటలకు నివేదన అనంతరం ఆలయం మూసివేస్తామన్నారు.

సోమవారం ఉదయం సంప్రోక్షణ పూజాధికాలు అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అనుమతి కల్పిస్తామని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు. భక్తులు సహకరించాలని కోరారు.

మద్దిలో ఘనంగా వినాయక నిమజ్జనం

పద్మనాభం-రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) వినాయకచవితి నవరాత్రుల సందర్భంగా మద్ది జంక్షన్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని గురువారం సాయంత్రం నిమజ్జనాన్ని బాణసంచా కాల్చుతూ కోలాహలంగా చేపట్టారు. విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామంలో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పులివేషాలు, కాంగో వంటి పలు జానపద కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొని నిమజ్జనాన్ని రాజు వెంకటపతిరాజు చెరువులో చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచ్ బుగత సన్యాసమ్మ. సత్యనారాయణ, పలువురు వార్డు సభ్యులు, కేఆర్బీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు జీవన భృతి

» అభయాంజనేయ ఆటో సంఘం డిమాండ్

పద్మనాభం-రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు పూటగడవడం కష్టంగా మారిందని, వారికి తక్షణమే ఉపాధి కల్పించాలని స్థానిక అభయాంజేయ ఆటో సంఘం అధ్యక్షుడు గాడు అప్పలరాజు డిమాండ్ చేశారు గురువారం అయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రతి నెలా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించాలని, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అధిక వడ్డీ ఆశ చూపి...

... 3వ పేజీ తరువాయి

నెలలుగా అక్కడ అద్దె కూడా చెల్లించలేదు. అందరికీ చెక్కులు ఇచ్చినా అవి చెల్లకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రూ.3 లక్షల నుంచి రూ.80 లక్షల దాకా...

నగరంలో ఇలాంటి మోసాలు ఎన్ని జరుగుతున్నా, ప్రజలు మళ్లీమళ్లీ మోసపోతున్నారు. బాధితుల్లో రూ.3 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ పెట్టుబడి పెట్టిన వారున్నారు. ఇప్పటివరకూ పన్నెండు మంది బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితుల వద్ద నుంచి వంద గ్రాముల బంగారం, రూ.60 వేలు మాత్రమే పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. అంతకు మించి మరేమీ వారి వద్ద లభించలేదు.

నిందితుడిపై సస్పెక్ట్ షీట్

ప్రధాన నిందితుడు నరమామిడి వెంకట పార్వతి నందకిషోర్(58)పై ఎంవీపీ కాలనీ నేర విభాగంలో సస్పెక్ట్ షీటు ఉంది. సుమారు పన్నెండేళ్ల కిందట ఈ షీటు తెరిచారు. సస్పెక్ట్ షీటు ఉన్న వారిపై నిరంతర నిఘా ఉండాలి. వారానికొకసారి స్టేషన్‌కు వచ్చి, సంతకం పెట్టాలి, కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కానీ అతడిపై సస్పెక్ట్ షీటు ఉన్నట్టు నేర విభాగం పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

తాజా కేసులో అతడిని విచారణ చేయగా, సస్పెక్ట్ షీటు ఉన్నట్టు తేలింది. నిఘా ఉన్నట్టయితే ఇలాంటి నేరాలు అరికట్టే అవకాశం ఉంది.

రూ.1.98 కోట్లతో సింహాచలం కూడలి అభివృద్ధి

» తొలిపావంచా సమీపంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన అధికారులు

సింహాచలం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన వాతావరణంతో స్వాగతం పలికేలా సింహాచలం కొండదిగువన తొలిపావంచా సమీపంలోని ప్రధాన కూడలిని రూ.1.98 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా గురువారం 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ఆధ్వర్యంలో జీవీఎంసీ ఈఈ దిలీప్, దేవస్థానం ఈఈ రామకృష్ణలతో కూడిన అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల అవసరాలకు తగ్గట్టుగా కూడలిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

తొలిపావంచాకు సమీపంలో పచ్చని పచ్చికను పెంచడం, పార్కింగ్, పరిసరాలను శోభాయమానంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. త్వరలో దేవస్థానం ఈవో, జీవీఎంసీ కమిషనర్లతో సమావేశమై తుది ప్రణాళికలను రూపొందించి వీలైనంత త్వరగా పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పర్యటనలో జోన్-8 కమిషనర్ హేమవతి,గ్రేటర్ డీఈ కుమార్, దేవస్థానం ఏఈలు లోకేశ్, రవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అధికారులు

జలాశయాలు కళకళ

... 3వ పేజీ తరువాయి

రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 81.16 మీటర్లు ఉంది. రైవాడ రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.6 మీటర్లకు చేరింది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 61 అడుగులు కాగా ప్రస్తుతం 59.6 అడుగులకు చేరింది. తాటిపూడి రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 297 అడుగులు కాగా ప్రస్తుతం 293.5 అడుగులకు, ముడసర్లోవ రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి 169 అడుగులు కాగా ప్రస్తుతం 159.05 అడుగులకు, గంభీరం రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 126 అడుగులు కాగా ప్రస్తుతం 123 అడుగుల మేర నీరు చేరింది. సెప్టెంబరు నెలలో కూడా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రిజర్వాయర్లలో నీటిమట్టాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

దృఢ సంకల్పం ఉంటే ఐఏఎస్ సాధన సాధ్యమే.. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

సాగర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవిత లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన, వాటిని సాధించడానికి దృఢ సంకల్పం ఉంటే ఐఏఎస్ వంటివి సాధించడం పెద్ద కష్టమేమీ కాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజస్థాన్‌లోని మారుమూల గ్రామానికి చెందిన తాను బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగం మొదలుకొని 8 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేసి ఎలాంటి శిక్షణ లేకుండా సివిల్స్‌లో విజయం సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన తీరును వివరించారు. జీవితంలో పోటీ అనేది లక్ష్యాలను సాధించడానికి ముందు, ఆ తరువాత కూడా ఎదుర్కొనవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు జీవితంలో తాము ఏమి సాధించాలనే లక్ష్యం పట్ల స్పష్టత కలిగివుండడంతో పాటు తగిన క్రమశిక్షణతో కృషి చేస్తే విజయాలు దరి చేరుతాయన్నారు. ఏ వృత్తిలోనైనా పోటీ తప్పదని, అది ఉన్నప్పుడే ప్రతిభ వెలుగులోని వస్తుందని పేర్కొన్నారు. అందరూ సామాజిక మాధ్యమాలను వ్యక్తిగత ప్రగతి కోసం వినియోగించుకోవాలని, విలువైన సమయాన్ని వృథా చేసుకోరాదని సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనంతరం కేతన్ గార్గ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గీతం ప్రొవైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేతన్ గార్గ్

సంప్రదాయబద్ధంగా అప్పన్నకు పవిత్ర సమర్పణ

సింహాచలం, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆరాధన తరువాత పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. పవిత్ర సమర్పణ విశిష్టతను స్థానాచార్యులు డాక్టర్ టీపీ రాజగోపాల్ వివరించారు. రాత్రి భక్తులకు స్వామివారి దర్శనాలను నిలిపివేశాక విశేష హోమాలు, చతుర్వేద పారాయణాలు, పురాణ, ఇతిహాది విన్నపాలు, పవిత్ర సమర్పణను అర్చకులు పూర్తి చేశారు.

పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు పర్యవేక్షణలో సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, చతుర్వేద పండితులు వేద పారాయణాలను పఠించారు. ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారులు వెంకటేశ్వరరావు, సత్యశ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.



ఉభయ దేవేరులతో గోవిందరాజస్వామి

ఇక ఆపండి

... 3వ పేజీ తరువాయి

సాయంత్రం రెండు ఉత్సవ కమిటీలకు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. వాస్తవానికి ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 17వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చినప్పటికీ నిబంధనలు పాటించకపోవడం వల్ల అనుమతులు ఉపసంహరించుకుంటున్నామని, వెంటనే అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. దాంతో లంకా మైదానం, పాత గాజువాకల్లో ఉత్సవాలకు ముగింపు పలికారు. బీచ్ రోడ్డులో ఏపీఐఐసీ మైదానంలో ఏర్పాటుచేసిన జర్మన్ సిల్వర్ వినాయక ఉత్సవాల వద్ద ఉచిత దర్శనాలు ఏర్పాటు చేయడం, ఎటువంటి ఫీజులు వసూలు చేయకపోవడంతో అక్కడ అధికారులు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిసింది.

వాటికి నిమజ్జనం కూడా లేదు

వినాయక ఉత్సవాల్లో పూజలు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. అది పూజా విధానంలో భాగం. ఇక్కడ దానిని కూడా వ్యాపారంగా మలుచుకున్నారు. లక్ష పట్టు చీరలతో గణపతిని తయారు చేశామని, ఆ చీరలను భక్తులకు ఉచితంగా పంచుతామని నిర్వాహకులు ప్రకటించారు. కానీ ఒక్కొక్క చీరకు రూ.500 రేటు పెట్టారు. చీరలు కావాలనుకునేవారికి ముందుగానే టికెట్లు విక్రయించారు. ఇప్పుడు దానిని మూసేయడంతో వాటిని ఏమి చేస్తారో చూడాల్సి ఉంది. ఇక కోటి లింగాల గణపతి కోసం అనకాపల్లిలోని గవరపాలెంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో శివలింగం అచ్చులు తయారు చేయించారు. వాటిని గణపతి బొమ్మ ఆకారంలో పేర్చి నలుపు రంగు స్ప్రే చేశారు. నిమజ్జనం చేయకుండా ఆ లింగాలను భక్తులకు పంచిపెడతామని నిర్వాహకులు ప్రకటించారు. ఆ లింగాలు పూర్తి ఆకారంలో లేవు. అవి అచ్చు బొమ్మలు. సగమే ఉంటాయి. పూజకు పనికి రావు. వాటిని ఎక్కువ కాలం ఇంట్లో ఉంచుకున్నా ఇబ్బందే. ఎక్కడ నిమజ్జనం చేసినా ఆ జలాలన్నీ కలుషితం అవుతాయి. అధికారులు ఏమి చేస్తారో చూడాలి.

గణనాథులకు ప్రత్యేక పూజలు: మండపాల వద్ద అన్న సమారాధనలు

కొమ్మాది, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గణనాథులకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పలుచోట్ల నిర్వాహకులు అన్న సమారాధనలను చేపట్టారు. ఇందులో భాగంగా ఇక్కడి స్వతంత్ర నగర్‌లో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశున్ని టీడీపీ 5వ వార్డు అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావులతో పాటు పీఎంపాలెం సీఐ బాలకృష్ణ దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్, నాయకులు నమ్మి రమణ, కొర్రాయి సురేశ్, బగాది లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్దనున్న షిర్డీ సాయినాథుని ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుని మండపం వద్ద అన్న సమారాధనను చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పి.రాంబాబు, సర్వదేవుళ్ల, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: చవితి ఉత్సవాల్లో భాగంగా 98వ వార్డులో పలుచోట్ల గణనాథుని ప్రతిష్ఠించిన మండపాల వద్ద నిర్వాహకులు అన్న సమారాధనలను చేపట్టారు. తొలిపావంచా వద్ద యువ బాల భక్త సమాజం ఆధ్వర్యంలో చేపట్టిన అన్న సమారాధనను కార్పొరేటర్ పీవీ నరసింహం ప్రారంభించారు.

విశాలాక్షినగర్: జీవీఎంసీ 9వ వార్డు పరిధిలో రెవెన్యూ కాలనీలో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధనను చేపట్టారు. తొలుత కార్పొరేటర్ స్వాతిదాస్ అన్న సమారాధనను ప్రారంభించగా, అసోసియేషన్ సభ్యులు నితిన్, రాజా, భీమారావు, హరి, సుధీర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.



స్వతంత్రనగర్‌లో గణేశుని సన్నిధిలో సీఐ బాలకృష్ణ, టీడీపీ నాయకులు

అయోధ్య బాలరామ గణపతిగా సంపత్ వినాయగర్


అయోధ్య బాలగణపతిగా పూజలు అందుకుంటున్న సంపత్ వినాయగర్

సిరిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ సంపత్ వినాయగర్ దేవాలయంలోని నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 9వ రోజైన గురువారం స్వామివారు శ్రీఅయోధ్య బాలరామ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి గణపతి హోమం, నాదస్వరం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం పెద్ద సంఖ్యలోని భక్తులకు నారాయణ సేవ నిర్వహించినట్టు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని సాంస్కృతిక కళా వేదిక వద్ద నాదస్వర కచేరి, కోలాటం, సామూహిక పారాయణాలు, సంకీర్తనలు, ప్రవచనాలు, వేద సభలోని వివిధ పండితులు హాజరై వినాయకుని గురించి ప్రసంగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి సహస్రనామనార్చన అనంతరం ప్రత్యేక హారతి స్వామివారికి నిర్వహించారు.

నూతన ఆవిష్కరణల దిశగా పనిచేయాలి

» భట్నాగర్ అవార్డు గ్రహీత జి.నరహరి శాస్త్రి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ జి.నరహరి శాస్త్రి, పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, పూర్వ వీసీ నాగేశ్వరరావు తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నూతన ఆవిష్కరణల దిశగా పని చేయాలని భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐటీ హైదరాబాద్ పూర్వసంచాలకుడు జి.నరహరి శాస్త్రి అన్నారు. శుక్రవారం ఏయూ కెమిస్ట్రీ విభాగంలో గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా 'క్వాంటిఫైయింగ్ మాలిక్యులర్ ఇంటరాక్షన్ థైర్ ఇంపాక్ట్ ఇన్ కెమిస్ట్రీ అండ్ బయాలజీ' అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో రసాయన శాస్త్రం, బయాలజీ, ఏఐ టెక్నాలజీలను మిళితం చేస్తూ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. 2024కు నోబెల్ బహుమతిని రసాయనశాస్త్రంలో శాస్త్రవేత్త, టెక్నాలజిస్టులకు సంయుక్తంగా అందించిన విధానం, వారు చేసిన పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ నూతన జ్ఞానాన్ని అందిస్తూ విస్తృత అవగాహన పెంపొందించే ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, మాజీ వీసీ జి.నాగేశ్వరరావు, విభాగాధిపతి శ్యామల తదితరులు పాల్గొన్నారు

తల్లీకుమార్తెల అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి, ఇద్దరు కుమార్తెల అదృశ్యంపై పోలీసులు కేసు నమోదుచేశారు.

హెచ్‌సీ అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. భీమిలి గొల్లల తిమ్మాపురం ప్రాంతానికి చెందిన కొర్రాయివెంకటరావు తన భార్య, ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదంటూ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దంపతుల మధ్య గొడవల కారణంగా భార్య శైలజ (36), కుమార్తెలు హేరంబిక (14), యోగితశ్రీ(12) గత నెల 28న పెదవాల్తేరులోని శైలజ అమ్మగారింటికి శైలజ తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కౌన్సెలింగ్ ఇవ్వడంతో రెండు రోజుల్లో తిరిగి ఇంటికి వచ్చేస్తానని చెప్పింది. అయితే ఈ నెల రెండో తేదీ రాత్రి పదకొండు గంటల నుంచి తల్లీ కుమార్తెలు కనిపించడం లేదని బంధువులు భర్త వెంకటరావుకు సమాచారం ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడం, రెండు ఫోన్లు స్విచ్ ఆఫ్ రావడంతో వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయండి

» ఆర్టీసీ అధికారులకు సీపీఐ నేతలు వినతి


ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజోతి) : తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతూ సీపీఐ నేతలు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పద్మావతికి గురువారం వినతిపత్రం అందజేశారు. తగరపువలసలోకి గతంలో ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు వచ్చేవని, ఇప్పుడు ఫ్లైఓవర్‌బ్రిడ్జి కారణంగా బస్సులన్నీ ఊర్లోకి రాకపోవడంతో విజయనగరం, శ్రీకాకుళం వెళ్లేవారంతా ఇబ్బందిపడుతున్నారన్నారు. దీనిని అధిగమించేందుకు కొన్ని సంవత్సరాలు కిందట తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేసారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన నిర్మాణం పూర్తిచే యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీజిల్లా కార్యవర్గసభ్యుడు ఎం.పైడిరాజు, సీపీఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, చిల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉషోదయ కూడలిలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో గురువారం బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మార్చిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఫలితాల ఆధారంగా జాతీయ స్థాయిలో మెరిట్ లిస్ట్ అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కేంద్రం సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యంలో అదనపు సంచాలకులు డాక్టర్ కృష్ణారావు, కేజీహెచ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సత్యవల్లి, అధ్యాపకురాలు డాక్టర్ అరుణకుమారి కమిటీ సభ్యులుగా కౌన్సిలింగ్ నిర్వహించారు. కాగా మిగిలిన అన్ని డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులకు సెప్టెంబరు 15 వరకూ అడ్మిషన్లు లభించనున్నట్లు సీనియర్ సంచాలకులు తెలిపారు.

ఫీజులు కట్టించుకొని జిమ్ మూసేశారు

» పోలీసులకు ఏయూ విదేశీ విద్యార్థుల ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డబ్బులు వసూలు చేసి, వ్యాయామశాల ఆకస్మికంగా మూసేశారని ఏయూలోని విదేశీ విద్యార్థులు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏయూ వసతి గృహంలో ఉంటున్న విదేశీ విద్యార్థులు పెదవాల్తేరు ఆదర్శనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ 2.0 వ్యాయామశాలలో ఎనిమిది నెలలు, తొమ్మిది నెలలు, ఏడాది కాలపరిమితికి రూ.8 వేల నుంచి రూ.పన్నెండు వేల వరకూ చెల్లించారు. తీసుకున్న నెలరోజుల్లోనే వ్యాయామశాలను ఆకస్మికంగా మూసేసి, నిర్వాహకులు ఫోన్లు కూడా ఎత్తడం మానేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని ఎంవీపీ పోలీసులను విద్యార్థులు ఆశ్రయించారు. వ్యాయామశాల తెరవడం లేదా తమ సొమ్మును తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

బాధ్యతగా మొక్కల పెంపకం

» విద్యార్థులకు ఏయూ వీసీ రాజశేఖర్ పిలుపు


ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ జీపీ రాజశేఖర్ తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొక్కల పెంపకాన్ని బాధ్యతగా స్వీకరించాలని ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఏయూ పూర్వ వీసీ డాక్టర్ సర్వేపల్లికి 'భారతరత్న' బహూకరించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏయూలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పనస, ఉసిరి, జామ, వెలగ, నేరేడు తదితర పండ్ల జాతి మొక్కలను నాటారు. విభాగాధిపతి సంధ్యదీపిక, రెక్టార్ ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నకు టీడీపీ నేతల జన్మదిన శుభాకాంక్షలు


టీడీపీ నేతల మధ్య కేక్ కట్ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదినం సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని పలువురు తెలుగుదేశం నాయకులు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి చోడే పట్టాభిరామ్, పలువురు తెలుగుదేశం నాయకులు ఎయిర్ పోర్టుకు వెళ్లి అయ్యన్నపాత్రుడికి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ వెంట తీసుకువెళ్లిన కేకును కట్ చేయించారు.

7న శ్రీవారి ఆలయం మూసివేత

సాగర్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చంద్ర గ్రహణం సందర్భంగా రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ఈనెల 7న మూసివేయనున్నట్టు ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఆదివారం పూజలు, దర్శనాలు కల్పించి, మధ్యాహ్నం 1.50 గంటలకు ఆలయాన్ని మూసివేస్తామని సంప్రోక్షణ అనంతరం తిరిగి సోమవారం ఉదయం భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పిస్తామన్నారు.

రేఖాజ్యోతికి ఎమ్మెల్యే వెలగపూడి అభినందనలు



ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దళితులకు పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో తూర్పు నియోజకవర్గం 11వ వార్డుకు చెందిన రేఖా జ్యోతికి ఆంధ్రప్రదేశ్ నాటక అకాడెమీ డైరక్టర్‌గా పదవి రావడంపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం తన కార్యాలయంలో ఆమెను అభినందించారు. ఈ మేరకు దళిత నాయకులు ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరి గోవింద్, గాడి సత్యం, ఈశ్వరరావు, తిమోతి, గోపి, షారోన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఏయూ ప్రతిష్ఠను పరిరక్షించండి'

మద్దిలపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన రాంబాబుకు గురువారం ఉత్తరాంధ్ర విద్యార్థి సేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ గత అయిదేళ్ల పాలకుల స్వార్థం, నిర్లక్ష్యం కారణంగా ఏయూ ప్రతిష్ఠ మసకబారిందన్నారు. విద్యాభివృద్ధి, పాలనపరంగా చాలా వెనుకబడిందన్నారు. విపరీతమైన రాజకీయ జోక్యంతో ఏయూ అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని, కొన్నివిభాగాలు మూసివేసే పరిస్థితిలో ఉన్నాయన్నారు. అందుకే పారదర్శకమైన పాలన అందించి మసకబారిన ఏయూ ప్రతిష్ఠను కాపాడాలని రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బసవ కృష్ణమూర్తి, వీరభద్రరావు, దంతేశ్వర పట్నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్‌కు తరలింపు

ఆరిలోవ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డిఫెన్స్ మద్యం తరలిస్తుండగా పోలీసులకు బుధవారం చిక్కిన పైనాపిల్ కాలనీకి చెందిన పోలాకి జీవన్‌రావును గురువారం కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి రిమాండ్‌కు తరలించినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. మద్యం బాటిల్స్ తరలించే వారిపై ప్రత్యేక నిఘా వేసినట్టు సీఐ చెప్పారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 29, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 26, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళదుంపలు 19, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది) 74, బరబాటి 32, ముల్లంగి 40, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

గణేశ్ మండపాల్లో అన్న వితరణ

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ యువనేత వెలగపూడి ప్రతాప్‌రుద్ర ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. నియోజకవర్గం పరిధిలోని ఎంవీపీ అయిదో సెక్టరు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, 19వ వార్డు జాలారిపేట, 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో, అప్పుఘర్ వద్ద గురువారం అన్నసమారాధనలు నిర్వహించారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీశెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో గురువారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత సంఘం ఆధ్వర్యంలో గణనాథునికి నిర్వహించిన పూజలో కార్పొరేటర్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పారి గిరిబాబు, యువజన ప్రెసిడెంట్ చెల్లుబోయిన గోవింద్, కర్రి రవి కుమార్, నరాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలాగే సింహాద్రిపురం, లక్ష్మీనరసింహానగర్ కొండవాలు ప్రాంతాల్లో కూడా అన్నప్రసాద వితరణలు జరిగాయి. కృష్ణా కళాశాల మార్గంలోని ఎలియన్స్ కళాశాలలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ భారీగా చేపట్టారు. కొత్త వెంకోజీపాలెం ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో జరిగిన అన్నప్రసాదవితరణ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో ఏయూకు 4వ స్థానం

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ అందించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో గతేడాది ఎయూకు 7వ స్థానం లభించగా, ఈ ఏడాది నాలుగో స్థానం లభించడం విశేషం. అలాగే రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ నెంబర్ వన్‌స్థానంలో నిలిచింది.

ఆచార్యులు, అధ్యాపకులకు 'ఉత్తమ' అవార్డులు


ఏయూ ఆచార్యులు దుర్గాప్రసాదరావు, జాలాది రవి, వల్లీకుమారి, అధ్యాపకులు అరుణ్‌కుమార్, రాధ

మద్దిలపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ముగ్గురు ఆచార్యులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, అణుభౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు దుర్గాప్రసాదరావు, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు వి.వల్లీకుమారి ఎంపియ్యారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ గెద్దాడ అరుణ్‌కుమార్, జైలు రోడ్డులోని మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండవల్లి రాధ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

బాహుబలి సెట్ వినాయకుడిని సందర్శించిన ఎంపీ శ్రీభరత్


మండపం వద్ద రుద్ర బాయ్స్‌తో ఎంపీ శ్రీభరత్

భీమునిపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిద్ధి వినాయక ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని 3వవార్డు నూకాలమ్మ గుడి స్టేజీ వద్ద ఎగువపేట రుద్ర బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాహుబలి సెట్ వినాయక మండపాన్ని విశాఖ ఎంపీ శ్రీభరత్ గురువారం సాయంత్రం సందర్శించారు. మండపంలోని విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం, బాహుబలి సెట్ రూప శిల్పి కారి శ్రీధర్, రుద్రాబాయ్స్‌ను ఆయన అభినందించారు. సెట్ చాలా అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఆయన వెంట పలువురు ప్రజా నాయకులు ఉన్నారు.

ఘన నిమజ్జనం




గణపతి నవరాత్రులు ముగిసిన సందర్భంగా గురువారం తీరంలో వినాయక ప్రతిమల నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. నగరంలోని వివిధ మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆర్కే బీచ్‌కు తీసుకొచ్చి, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. - విశాఖపట్నం



అక్కయ్యపాలెం ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద గురువారం మహారాజ గణపతిగా దర్శనమిచ్చిన లక్ష్మీగణపతి -ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం



అర్ధనారీశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సీతంపేటలోని దుర్గాగణపతి -ఆంధ్రజ్యోతి, సీతంపేట

7న రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం నేతృత్వంలో ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించనున్న ఎనిమిదో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ ఈ నెల 7న పోతినమల్లయ్యపాలెంలోని శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వేదికగా జరుగుతుందని సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. అండర్-6, 8, 10, 12, 14, 16 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలుంటాయని పేర్కొన్నారు. ఈ టోర్నీలో పాల్గొనేవారు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. ఆసక్తిగలవారు 5న సాయంత్రం 5 గంటలలోపు ఫోన్:9010323324, 9848460137 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

7న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మూసివేత

మహారాణిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 7న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 8వ తేదీ ఉదయం 7 గంటల వరకు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దర్శనాలు నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. గ్రహణం రోజు మధ్యాహ్నం పంచామృతాభిషేకం అనంతరం ఆలయాన్ని మూసివేసి, 8న తెల్లవారుజామున సంప్రోక్షణ, పంచామృతాభిషేకం అనంతరం ఉదయం 7 గంటలకు దర్శనాలు పునఃప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్పాహార్ స్టేషన్‌లో హాల్టు సౌకర్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ-అమృత్‌సర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 5 నుంచి బెల్పాహార్‌లో ప్రయోగాత్మకంగా హాల్ట్ సౌకర్యం కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న కేరళకు చెందిన అశ్రిత్ (19), మహ్మద్ అల్తాఫ్ (18)లను గురువారం ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది అరెస్టు చేసి రూ.43 వేల విలువైన 8.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంచరపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ రెండోజోన్ కంచరపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకేనాయుడు తెలిపారు. కంచరపాలెం సెక్షన్‌లో ఆశవానిపాలెం, చాకలి గెడ్డ, వై.జంక్షన్, లోకోషెడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజ్ఞానాన్ని బోధించాలి: సీపీ బాగ్చి



ఉపాధ్యాయునికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, కార్పొరేటర్ నాగరాజు



మాజీ ప్రొఫెసర్ డా.రామకృష్ణారావును సత్కరిస్తున్న అధ్యాపకులు

అల్లిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలతో పాటు విజ్ఞానాన్ని బోధించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. గురువారం అల్లిపురంలోని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 85 మంది ఉపాధ్యాయులను సీపీ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువులే సమాజ ప్రగతి నిర్దేశకులని అన్నారు. గురుశిష్య సంప్రదాయం మానవజాతికి శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. తాను కూడా నాలుగేళ్లు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగానని అన్నారు. చాలా మంది ప్రమాదాలు జరిగినప్పుడు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, మానవత్వంతో స్పందిస్తే చట్టపరంగా ఎటువంటి ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. ప్రమాదాలకు గురైనవారికి ప్రథమ చికిత్స అందించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్పొరేటర్ కందుల నాగరాజు, టూటౌన్ సీఐ ఎర్రమనాయుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కేఎన్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్లు కందుల బద్రీనాథ్, కేదార్నాథ్, శాలివాహన, విజయగౌరీ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

కంచరపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం సెలవుదినం కావడంతో కళాశాల్లో గురువులకు గురువారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతను తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా.కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ ప్రొఫెసర్ డా.సుంకర రామకృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గురువుల ప్రాధాన్యతను, పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వి.సంధ్యారాణి, జనరల్ హెడ్ పీఎం.బాష, ఎస్.వి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టరు ప్రశాంత కుమారికి ఉత్తమ అధ్యాపక అవార్డు



సముద్రాల ప్రశాంత కుమారి

కంచరపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల్లో ప్లాస్టిక్స్ &పాలిమర్స్ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు సముద్రాల ప్రశాంత కుమారి జోన్-1 ఉత్తరాంధ్ర నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో ప్రభుత్వం ప్రశాంత కుమారిని ఘనంగా సత్కరించి అవార్డును బహూకరించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు అవార్డును ప్రదానం చేస్తారు. ఈ నేపథ్యంలో డా.ప్రశాంత కుమారిని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది గురువారం ప్రశాంతకుమారిని ఘనంగా సత్కరించారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఘనంగా ఓనం వేడుకలు

జ్ఞానాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో గురువారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోమ్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థినులు ఓనం రంగవల్లికల పోటీలు నిర్వహించారు. రిథమ్ క్లబ్ విద్యార్థినులు సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించేలా ఓనం సాంస్కృతిక ప్రదర్శన చేశారు.



వినాయక ఉత్సవాల నేపథ్యంలో గ్రేటర్ 27వ వార్డు శ్రీనగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, టీడీపీ నాయకులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ గొలగాని వీరారావు తదితరులు -ఆంధ్రజ్యోతి, అక్కయ్యపాలెం



సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలి సమీపంలోని ఆర్ అండ్ బి క్వార్టర్స్ వద్ద న్యూ యంగ్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం -ఆంధ్రజ్యోతి, సీతమ్మధార

సమస్యలు పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం

▸ ఉద్యోగులు, పెన్షనర్ల జేఏసీ వెల్లడి

మహారాణిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ ఛైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి, పెన్షనర్లకు ప్రభుత్వ బకాయిల వివరాలు తెలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మధ్యంతర భృతి ప్రకటించాలని, 12వ వేతన సంఘాన్ని నియమించాలని, పెండింగ్ డీఏలు, 11వ వేతన సంఘం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర అసంతృప్తి, ఆందోళన నెలకొన్నాయని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమ బద్ధీకరణకు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ ఉద్యోగుల సర్వీస్ రూల్స్ పొందుపరచాలని కోరారు. రూ.10 వేల లోపు పెన్షన్ పొందుతున్నవారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే త్వరలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాల్సి ఉంటుం దని తెలిపారు. ఈ సమావేశంలో సత్తి నాగేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరావు,ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పునకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రతిపాదన



ఆర్వో జ్ఞానవేణి అధ్యక్షతన జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో పాల్గొన్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారిణి జ్ఞానవేణి పర్యవేక్షణలో స్థానిక బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం జరిగింది. ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలు మార్చాల్సిన అవసరం ఉందని, ఆక్సిజన్ టవర్స్ వద్ద కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, కెఎస్ఆర్ వ్యాలీ, సీతమ్మధార వసంత బాలస్కూల్, బిర్లా జంక్షన్ వద్ద లక్ష్మీ నివాస్ అపార్ట్‌మెంట్స్ వారి పోలింగ్ కేంద్రం మార్పు చేయాలని సూచించారు. జాతీయ రహదారి దాటాల్సిన ఓటర్ల సమస్యను ప్రస్తావిస్తూ వారికి సౌకర్యంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ, జనసేన, టీడీపీ, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్ రెడ్డికి ఘననివాళి



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు కె.రామకృష్ణ తదితరులు

అల్లిపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేసేవారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శ్లాఘించారు. అల్లిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. అజాత శత్రువుగా పేరొందిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలని ఆకాంక్షించే వారని గుర్తుచేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె రెహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో పార్టీ సీనియర్ నాయకులు మానం ఆంజనేయులు, జె.వి.సత్యనారాయణమూర్తి, సీహెచ్ రాఘవేంద్రరావు, కార్పొరేటర్ ఎ.జె. స్టాలిన్, కత్తిపద్మ, వామపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విమెన్ టీ20 టోర్నీలో తుంగభద్రపై రాయలసీమ రెయిన్స్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్ర వుమెన్ లీగ్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో రాయలసీమ రెయిన్స్ 51 పరుగుల తేడాతో తుంగభద్ర దివాస్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాయలసీమ రెయిన్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 148 పరుగులు చేసింది. అనుష (33), గ్రీష్మ (22), దేవిక కాండ్రేగుల (41 నాటౌట్), హేమ రోషిణి (24) రాణించారు. ఛేదనలో తుంగభద్ర దివాస్ 18.4 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. దీక్ష (33) మినహా మిగిలినవారు పెవిలియన్‌కు క్యూ కట్టారు. రాయలసీమ బౌలర్లు తరిణి జోషి, దేవిక కాండ్రేగుల, భార్గవి లక్ష్మి తలో మూడు వికెట్లు తీసి జట్టుకు విజయాన్నందించారు. ఆల్‌రౌండర్ ప్రతిభ చూపిన దేవిక కాండ్రేగుల వుమెన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికైంది.

సీఎం సహాయనిధి మంజూరు పత్రాల అందజేత



మంజూరుపత్రాలు అందచేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లో గల జనసేన పార్టీ నగర కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఏడుగురికి రూ.4,06,744ల మంజూరు పత్రాలను అందచేశారు. పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

90 మంది ఉపాధ్యాయులకు అవార్డులు

... 3వ పేజీ తరువాయి

బి.అప్పలరాజు (లక్ష్మీపురం), బి.శ్రీను (మాధవధార), ఎ.వెంకటరమణ (కె.కాలనీ), పి.పద్మలత (పెదనరవ), సి.మత్స్యవరప్రసాద్ (గోపాలపట్నం), ఎస్.రామతులసి (రైల్వేకాలనీ), పి.శాంతికుమారి (ఎంటీపాలెం), ఎస్.లక్ష్మణరావు, జె.వివేకానంద (శ్రీకృష్ణాపురం), ఆర్.కీర్తి (భీమిలి కేజీబీవీ), కేటీఎస్ ప్రసాదిని (ఆనందపురం కేజీబీవీ), బి.దేవి (పద్మనాభం కేజీబీవీ), ఎ.రాజారమేష్ (శొంఠ్యాం), టీవీ రమణ (ఎండాడ), టి.లలితాశ్రీనివాస్ (బాలభవన్), కె.ప్రశాంతి (తర్లువాడ), పి.సుగుణావతి (గండిగుండం), ఎం.శంకరరావు (తోటగరువు), వీవీ రమాకుమారి (కణితి), కె.శ్రీనివాసరావు (యారాడ), కె.ఈశ్వరరావు (భీమిలి), కె.ఎర్రన్నాయుడు (సిర్లపాలెం), కె.శ్రీనివాసరావు, వి.ఆంజనేయులు (బి.తాళ్లవలస), మాలతి (గొట్టిపల్లి), ఎ.సత్యకళ, జి.వెంకటమురళి (అడవివరం), ఎం.పార్వతీదేవి (బోయపాలెం), కేవీఎస్ఎస్ఆర్ గుప్తా (ఆనందపురం), ఎ.వెంకటరమణ (శ్రీహరిపురం), టి.శ్రీశైలజ (వేములవలస), పీవీఎస్ నరసింహం (వేపగుంట), ఎం.దామోదర్ (సీతమ్మధార నెహ్రూ స్కూలు) ఉన్నారు. ఎస్జీటీ కేటగిరీలో జి.సంధ్యారాణి (ఆర్పీపేట), బి.హేమంత్‌కుమార్ (చేపలపాలెం), వై.రాణి (సాయిరామ్ కాలనీ), విఘ్నేశ్వరి (ఎండాడ), షేక్ రంజాన్ (మదీనాబాగ్), ఎం.సునీత (గాంధీనగర్), పి.లక్ష్మణ (తోటగరువు), కె.మురళి (తునిపాలెం), టి.జగన్నాథం (బుచ్చిరాజుపాలెం), షేక్ గౌసియాబేగం (ఎన్జీజీవో కాలనీ), బి.నిర్మల (దుగ్గవానిపాలెం), జి.హేమేశ్వరరావు (ఆరిలోవ), డి.సత్యనారాయణ (మింది), కె.సాయికృష్ణ (పెదగదిలి), కె.గంగాభవానీ (గొల్లలపాలెం), వి.రామారావు (యాతపేట), పి.అనుపమ (శివాజీపాలెం), డి.ఇందిరాప్రియదర్శిని (అగనంపూడి), ఇ.ప్రసాద్ (రామనగర్), టి.అలివేలుమంగ (వేపగుంట), ఎం.అనిపూర్ణిమ (సింహాచల నగర్)

జలాశయాలు కళకళ

... 3వ పేజీ తరువాయి

రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 81.16 మీటర్లు ఉంది. రైవాడ రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 113.6 మీటర్లకు చేరింది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 61 అడుగులు కాగా ప్రస్తుతం 59.6 అడుగులకు చేరింది. తాటిపూడి రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 297 అడుగులు కాగా ప్రస్తుతం 293.5 అడుగులకు, ముడసర్లోవ రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి 169 అడుగులు కాగా ప్రస్తుతం 159.05 అడుగులకు, గంభీరం రిజర్వాయర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 126 అడుగులు కాగా ప్రస్తుతం 123 అడుగుల మేర నీరు చేరింది. సెప్టెంబరు నెలలో కూడా మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రిజర్వాయర్లలో నీటిమట్టాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఇక ఆపండి

... 3వ పేజీ తరువాయి

సాయంత్రం రెండు ఉత్సవ కమిటీలకు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. వాస్తవానికి ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 17వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చినప్పటికీ నిబంధనలు పాటించకపోవడం వల్ల అనుమతులు ఉపసంహరించుకుంటున్నామని, వెంటనే అన్ని కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. దాంతో లంకా మైదానం, పాత గాజువాకల్లో ఉత్సవాలకు ముగింపు పలికారు. బీచ్ రోడ్డులో ఏపీఐఐసీ మైదానంలో ఏర్పాటుచేసిన జర్మన్ సిల్వర్ వినాయక ఉత్సవాల వద్ద ఉచిత దర్శనాలు ఏర్పాటు చేయడం, ఎటువంటి ఫీజులు వసూలు చేయకపోవడంతో అక్కడ అధికారులు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిసింది.

వాటికి నిమజ్జనం కూడా లేదు

వినాయక ఉత్సవాల్లో పూజలు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. అది పూజా విధానంలో భాగం. ఇక్కడ దానిని కూడా వ్యాపారంగా మలుచుకున్నారు. లక్ష పట్టు చీరలతో గణపతిని తయారు చేశామని, ఆ చీరలను భక్తులకు ఉచితంగా పంచుతామని నిర్వాహకులు ప్రకటించారు. కానీ ఒక్కొక్క చీరకు రూ.500 రేటు పెట్టారు. చీరలు కావాలనుకునేవారికి ముందుగానే టికెట్లు విక్రయించారు. ఇప్పుడు దానిని మూసేయడంతో వాటిని ఏమి చేస్తారో చూడాల్సి ఉంది. ఇక కోటి లింగాల గణపతి కోసం అనకాపల్లిలోని గవరపాలెంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో శివలింగం అచ్చులు తయారు చేయించారు. వాటిని గణపతి బొమ్మ ఆకారంలో పేర్చి నలుపు రంగు స్ప్రే చేశారు. నిమజ్జనం చేయకుండా ఆ లింగాలను భక్తులకు పంచిపెడతామని నిర్వాహకులు ప్రకటించారు. ఆ లింగాలు పూర్తి ఆకారంలో లేవు. అవి అచ్చు బొమ్మలు. సగమే ఉంటాయి. పూజకు పనికి రావు. వాటిని ఎక్కువ కాలం ఇంట్లో ఉంచుకున్నా ఇబ్బందే. ఎక్కడ నిమజ్జనం చేసినా ఆ జలాలన్నీ కలుషితం అవుతాయి. అధికారులు ఏమి చేస్తారో చూడాలి.

అధిక వడ్డీ ఆశ చూపి...

... 3వ పేజీ తరువాయి

నెలలుగా అక్కడ అద్దె కూడా చెల్లించలేదు. అందరికీ చెక్కులు ఇచ్చినా అవి చెల్లకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నిందితులను పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు.

రూ.3 లక్షల నుంచి రూ.80 లక్షల దాకా...

నగరంలో ఇలాంటి మోసాలు ఎన్ని జరుగుతున్నా, ప్రజలు మళ్లీమళ్లీ మోసపోతున్నారు. బాధితుల్లో రూ.3 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ పెట్టుబడి పెట్టిన వారున్నారు. ఇప్పటివరకూ పన్నెండు మంది బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితుల వద్ద నుంచి వంద గ్రాముల బంగారం, రూ.60 వేలు మాత్రమే పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. అంతకు మించి మరేమీ వారి వద్ద లభించలేదు.

నిందితుడిపై సస్పెక్ట్ షీట్

ప్రధాన నిందితుడు నరమామిడి వెంకట పార్వతి నందకిషోర్(58)పై ఎంవీపీ కాలనీ నేర విభాగంలో సస్పెక్ట్ షీటు ఉంది. సుమారు పన్నెండేళ్ల కిందట ఈ షీటు తెరిచారు. సస్పెక్ట్ షీటు ఉన్న వారిపై నిరంతర నిఘా ఉండాలి. వారానికొకసారి స్టేషన్‌కు వచ్చి, సంతకం పెట్టాలి, కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కానీ అతడిపై సస్పెక్ట్ షీటు ఉన్నట్టు నేర విభాగం పోలీసులకు తెలియకపోవడం గమనార్హం. తాజా కేసులో అతడిని విచారణ చేయగా, సస్పెక్ట్ షీటు ఉన్నట్టు తేలింది. నిఘా ఉంటే ఇలాంటి నేరాలు అరికట్టే అవకాశం ఉంది.

నవంబరుకల్లా కంపెనీలకు భూములు

... 3వ పేజీ తరువాయి

వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. డేటా సెంటర్లకు ఇండిపెండెంట్ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరాకు అవసరమైన లైన్లు అవసరమైనందున, అందుకు తగిన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. వీఎంఆర్‌డీఏ డెక్ భవనంలో నెలకొల్పిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ హబ్‌ను సందర్శించనున్నారని అన్నారు. హబ్ పూర్తిస్థాయిలో పనిచేసేలా క్యాలెండర్ రూపొందిస్తామని ప్రకటించారు. ఏయూ, హైదరాబాద్ ఐఐటీ, గీతం వర్సిటీలతో ఇప్పటికే ఒప్పందాలు జరిగాయన్నారు. ఇక్కడ ప్రతి వారం ఒక ఈవెంట్ జరిగేలా షెడ్యూల్ డిజైన్ చేస్తామన్నారు. ఐటీ, వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్ చేనేత, చేతివృత్తులు, డ్వాక్రా మహిళలు...ఇలా ప్రతి రంగానికి చెందిన వ్యక్తులను పిలిచి ఆయా రంగాల్లో నిపుణులతో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. ఆయా రంగాల్లో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలపై చర్చించి మార్కెట్‌కు అనుకూలంగా వస్తు ఉత్పత్తులు చేసి అమ్మకాలు చేపట్టేలా సాంకేతికత సహకారం అందించడమే లక్ష్యమన్నారు. ఇంకా ఆయా రంగాల్లో సమస్యలు పరిష్కరించడానికి ఇదే హబ్‌లో హ్యాక్‌థాన్‌లు నిర్వహిస్తామన్నారు. నెలకు ఒక హ్యాక్‌థాన్ నిర్వహించేలా రోడ్‌మ్యాప్ ఖరారుచేస్తామన్నారు. రతన్‌టాటా హబ్‌కు ఇప్పటికే ఒకరిని సీఈవోగా నియమించామన్నారు. నగరంలో కాలుష్యం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. తీరం పొడవునా మురుగునీరు సముద్రంలోకి వెళ్లకుండా శుద్ధి చేయడానికి తగిన కార్యాచరణ అమలుకు ప్రపంచబ్యాంకు నుంచి రూ.560 కోట్ల సాయం తీసుకుంటున్నామని అన్నారు. అప్పుఘర్‌లో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను మరింత మెరుగుపర్చుతామన్నారు. సాగర్‌నగర్ వద్ద ప్లాంటు ఏర్పాటుచేస్తామన్నారు. మధురవాడ ప్రాంతం నుంచి మురుగునీటిని మళ్లించి అక్కడ శుద్ధి చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఖరీఫ్‌లో 4,600 హెక్టార్లకుగాను ఇంతవరకూ 3,600 హెక్టార్లలో పంటలు వేశారన్నారు.

ట్రాక్‌పై విధుల్లో అత్యంత అప్రమత్తత అవసరం: డీఆర్ఎం



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ట్రాక్‌పై పనిచేసే సమయంలో పుష్ ట్రాలీ, మోటారు ట్రాలీ వంటివాటిని ఉపయోగించడంలో పాటించాల్సిన జాగ్రత్తలు, విధానాలపై వాల్తేరు రైల్వే ఇంజనీరింగ్ విభాగం గురువారం ట్రాక్ మెయింటెనర్లు, ట్రాలీ ఆపరేటర్లు, కీమెన్, సూపర్‌వైజర్ సిబ్బందికి అవగాహన కల్పించారు. పుష్, మోటారు ట్రాలీలతో పనిచేసే సమయంలో అనుసరించాల్సిన భద్రతా నియమాలు, మార్గదర్శకాలను సీనియర్ డీఈఎన్ (సౌత్) బినవీన్‌రాజు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ట్రాక్ నిర్వహణలో సిబ్బంది అనేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాలీని నిర్వహించే ముందు భద్రత నియమాలు, జాగ్రత్తలపై అవగాహన పొందాలని, ట్రాలీని ఉపయోగించే ముందు అవసరమైన అన్ని పరికరాలను తనిఖీ చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో బ్లాక్ ప్రొటెక్షన్, ట్రాక్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసే సమయంలో భద్రతా గాడ్జెట్‌లను తప్పనిసరిగా వాడాలని నొక్కి చెప్పారు. ట్రాలీ కార్యకలాపాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రధానంగా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో ఏడీఈఎన్ (ట్రాక్) ఎస్ఎంకె.పట్నాయక్, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాష్‌టెక్స్ స్టీమ్ బాయిలర్ ప్రారంభం

గాజువాక ఇండస్ట్రియల్ ఏరియాలో అల్ట్రా వాష్‌టెక్స్ ప్రైవేటు లిమిటెడ్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా గురువారం సందర్శించి, అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన స్టీమ్ బాయిలర్‌ను ప్రారంభించారు. రైల్వేలకు సరఫరా చేస్తున్న లినెన్ బెడ్‌షీట్స్, టవల్స్ పిల్లో కవర్స్ శుభ్రం చేయడానికి ఉపయోగిస్తున్న వివిధ యంత్రాలను పరిశీలించారు. బెడ్‌షీట్ క్యాలెండరింగ్, ఫోల్డింగ్ మెషిన్, వాషర్ ఎక్స్‌ట్రాక్టర్లతో కొత్తగా అధునాతన యంత్రాలతో ఏర్పాటు చేసిన స్టీమ్ బాయిలర్ పనితీరును పరిశీలించారు. ఎనిమిది గంటల్లో 7.5 టన్నుల లాండ్రీ సామర్థ్యం గల ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేయడాన్ని అల్ట్రా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.జి.త్రినాథరావు, డైరెక్టర్ ఎల్.సాయి వందనను ఆయన అభినందించారు.

రైతు బజార్లలో కర్నూలు ఉల్లి విక్రయాలు


మందకొడిగా సాగుతున్న అమ్మకాలు
గోపాలపట్నం రైతు బజారులో కర్నూలు ఉల్లిపాయలు

గోపాలపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతు బజార్లలో విక్రయిస్తున్న దేశవాళీ (కర్నూలు) రకం ఉల్లిపాయల విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి నష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు గాను రైతులు పండించిన ఉల్లిపాయలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నగరంలోని రైతు బజారుల్లో విక్రయిస్తుంది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో రైతు బజార్లలో విక్రయిస్తున్న ఉల్లి వైపు మొగ్గు చూపడం లేదు. దీంతో రైతు బజార్లలో ఉల్లిపాయల విక్రయాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

సాధారణంగా నగరంలోని ఉన్న అన్ని రైతుబజార్లలో శని, ఆదివారాల్లో రోజుకు సుమారు వంద టన్నుల వరకు ఉల్లిపాయల విక్రయాలు జరుగుతాయి. మిగిలిన రోజుల్లో సుమారు 80 టన్నుల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. మహారాష్ట్ర నుంచి దిగుమతి అయిన ఉల్లిపాయలనే సాధారణంగా రైతు బజార్లలో విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం రాయలసీమ ఉల్లి రైతులు నష్టాలబాట పట్టడంతో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉల్లి రైతుల నుంచి కొనుగోలు చేసిన సరకును రైతు బజార్లలో కిలో రూ.18 చొప్పున విక్రయిస్తున్నారు.

నగరంలోని అన్ని రైతు బజార్లలో ప్రస్తుతం ఇదే రకం ఉల్లిపాయలను అమ్ముతున్నారు. ఈ దేశవాళీ ఉల్లిపాయలు పరిమాణం కాస్త చిన్నవిగా ఉండడంతో కొనుగోలుదారులు వీటిని తీసుకునేందుకు పెద్దగా మొగ్గు చూపడం లేదు. దీంతో ప్రస్తుతం నగరంలోని అన్ని రైతుబజార్లలో రోజుకు కనీసం 20 టన్నుల ఉల్లి విక్రయాలు కూడా జరగడం లేదు. రుచికరంగా ఉండే ఈ దేశవాళీ ఉల్లిపాయలను ఉత్తరాది ప్రాంత ప్రజలు కూడా ఎంతో ఇష్టపడతారు. విదేశాలకు కూడా వీటి ఎగుమతి జరిగేది. ప్రస్తుతం ఎగుమతులు నిలిచిన కారణంగా వీటిని మన రాష్ట్రంలోనే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ ఆశించిన సాయిలో అమ్మకాలు జరగడం లేదు.

మహారాష్ట్ర ఉల్లికే కొనుగోలుదారుల మొగ్గు

పరిమాణంలో కాస్త పెద్దగా ఉండే మహారాష్ట్ర ఉల్లిపాయల ధర కిలో రూ.21 కాగా బహిరంగ మార్కెట్‌లో రూ.25 నుంచి రూ.30 మధ్య విక్రయిస్తున్నారు. రైతుబజార్లలో మహారాష్ట్ర ఉల్లి లభ్యం కాకపోవడంతో చాలామంది ధర ఎక్కువైనా బహిరంగ మార్కెట్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. కానీ దేశవాళీ ఉల్లి కొనుగోలుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. రైతుల మేలు కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు కాస్త అవగాహన పెంచుకుని కొద్ది రోజుల పాటు దేశవాళీ ఉల్లిని కొనుగోలు చేస్తే కర్షకులకు ఊరట కలుగుతుంది.

కార్యకర్తల సంక్షేమమే పరమావధి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ పరమావధిగా భావిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 86వ వార్డు పరిధి పకీరుతక్యాలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త పట్నాల ప్రసాద్ కుటుంబానికి గురువారం ఆయన పది వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. అనంతరం పకీరుతక్యాలో జరిగిన సభలో పల్లా మాట్లాడుతూ గ్రామ పెద్దలందరూ కూర్చుని అర్హులైన నిర్వాసితుల ప్రత్యేక జాబితాను తయారు చేయించి ఇవ్వాలన్నారు. నాలుగు దశాబ్దాల ఏపీఐఐసీ నిర్వాసితుల భూ సమస్యను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ, నాయకులు వేగుంట శ్రీనివాస్, కె.రమేశ్, ఎం.కనకరాజు, సుబ్బయ్య, గణపతి, వెంకటేశ్, ముస్లిం పెద్దలు చిన్ని, మౌలా, పీరూబాబా, హుస్సేన్, ఇల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పెన్నిధి సీఎం సహాయ నిధి: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: పేదలకు పెన్నిధి వంటిది సీఎం సహాయ నిధి అని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని తమ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజవర్గ పరిధిలో గల 32 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.18 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స పొందేందుకు ఈ నిధులను వినియోగించాలని కోరారు. పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుఖవాసి, అజయ్, ఉగ్గిన దేవుడు, కరక దేవుడు, బి.హరగోపాల్, ఎ.చినరమణ, తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి చెక్కు అందజేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

11న గాజువాకలో సీపీఎం బహిరంగ సభ

మహారాణిపేట(విశాఖపట్నం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈవోపి పేరిట విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు పాత గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. కేంద్రం చేస్తున్న ప్రైవేటీకరణ యత్నాలను కూటమిలోని బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీలు ఆపాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, తొలగించిన ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేయనున్నట్లు సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. గురువారం జగదాంబ జంక్షన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. బహిరంగ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ నెల 11 వరకు జిల్లావ్యాప్తంగా సీపీఎం చేపట్టనున్న ప్రచారోద్యమానికి స్టీల్ ప్లాంట్ గాజువాక ప్రాంతాల కార్మిక కుటుంబాలు, విశాఖ జిల్లా ప్రజానీకం మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, బి.జగన్ కృష్ణారావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

అగనంపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, ఇండోర్ సబ్ స్టేషన్ లైన్ పనులు చేపడుతున్నందున ఈ నెల 6వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అగనంపూడి, డొంకాడ, బీసీ కాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, పెదమడక, పినమడక, ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఏరియా, శనివాడ, శాంతినగర్, గల్లవానిపాలెం, జాబిలి హిల్స్, పాత అగనంపూడి, దువ్వాడ, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్కాపురం: మల్కాపురం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 6వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా హరిజనవీధి, జాలరివీధి, శెట్టిబలిజవీధి, వెంకన్నపాలెం, సెవెన్ టెంపుల్ జంక్షన్, నగరాల వీధి, ఏకేసీ కాలనీ, కేకేఎల్ జీవీఎంసీ పంప్ హౌస్, ఈఎస్ఐ ఆస్పత్రి, ఐఎంయూ, సీఈఎంఎస్, సింధియా జంక్షన్, పోస్టాఫీసు, మసీద్, ఎంఎస్ఆర్ బిల్డింగ్, ఎయిర్‌పోర్టు అథారిటీ, రాడర్, లైట్ హౌస్, యారాడ హిల్స్ యారాడ గ్రామం, కాకరలోవ, జైయాంధ్రాకాలనీ, చింతలలోవ, క్రాంతినగర్, బీపీసీఎల్ గొడౌన్, వై-జంక్షన్, డాక్‌యార్డు ఏరియా, నవయుగ, ఈఐపీఎల్, ఆయిల్ ఓర్వా, శాతవాహన బస్టాప్, కాకతీయ గేటు, ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రి, చింతామణి టెంపుల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే త్రినాథపురం ఫీడర్ పరిధిలోని గాంధీ వీధి, రజకవీధి, పల్లివీధి, కాంత్రినగర్, త్రినాథపురం ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

మేహాద్రిగెడ్డ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల


జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి వరద నీటి విడుదల కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి రిజర్వాయర్ ఒక గేటును ఎత్తి 178 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటి మట్టం 60.1 అడుగులు ఉంది. రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టకపోవడంతో నీటి విడుదల కొనసాగుతుంది. రిజర్వాయర్ నీటిమట్టం 60 అడుగులకు చేరాక గేటు దించుతామని సిబ్బంది తెలిపారు.

సీపీఎం, సీపీఐ నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలి

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కబంధ హస్తాల్లో చిక్కుకుని కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ అంశంపై కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ఉక్కు పరిరక్షణ, కార్మికుల హక్కుల రక్షణ, నిర్వాసితులకు ఉపాధి అంశంపై ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. వైసీపీ వలలో సీపీఐ. సీపీఎం నాయకులు చిక్కుకున్నారని ఆరోపించారు. పార్టీ పరిశీలకుడు ఎంవీ చౌదరి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో నాయకులు హరికృష్ణ, కె.శ్రీనివాస వర్మ, రాజన్‌రాజు, మాధవ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

ప్రహరీ నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెంలో వీధి కాలువకు అడ్డంగా ప్రహరీని నిర్మించడం పట్ల స్థానికులు జీవీఎంసీ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇక్కడి బంగారుమాంబ ఆలయ సమీపంలో బోగాది వీధిలో సుమారు 20 ఏళ్ల క్రితం సిమెంటు రోడ్డు, కాలువను నిర్మించారు. ప్రస్తుతం ఈ కాలువ శిథిలావస్థకు చేరినా వీధిలో నివసిస్తున్న వారి వాడుక నీటితో పాటు వర్షపు నీరు బయటకు పోయేందుకు ఇదే ఆధారంగా మారింది. అయితే గత వారం స్థానికులు కొందరు కాలువకు అడ్డంగా ప్రహరీని నిర్మించేందుకు ప్రయత్నించగా పలువురు అడ్డుకున్నారు. ప్రహరీని నిర్మిస్తే మురుగు నీరు బయటకు పోయే మార్గం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కరారు.

నేత్ర దానంపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న శంకర్ ఫౌండేషన్ ఉద్యోగులు, విద్యార్థులు

వేపగుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేత్ర దాన పక్షోత్సవాలను పురస్కరించుకుని నాయుడుతోట సాయిమాధవనగర్‌లోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నేత్ర దానంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కార్నియా విభాగాధిపతి డాక్టర్ నరేష్, డీజీఎం వేణుగోపాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు నేత్ర దానం ఆవశ్యకతను వివరించారు. గోపాలపట్నం బంక్ నుంచి ఆస్పత్రి వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఉద్యోగులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి కంటి విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ కళ్ల సంరక్షణ, నేత్ర దానం ఆవశ్యకతను వివరించారు. నేత్రదానం చేయడం వల్ల అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రత్యూష, భక్తవత్సల రేష్మ, లలిత, రోజా, ఏవో రవిరాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలని ధర్నా

ఆటోనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మురుగు చేరుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ 70వ వార్డు టీవీఎస్ కాలనీవాసులు గురువారం ఉదయం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వాడుక నీరు వెళ్లేందుకు తగిన డ్రైనేజీ అవుట్‌లెట్ లేక ఖాళీ స్థలంలో ఉండిపోతుంది. ఇటీవల ఆ స్థల యజమాని అడ్డుకట్ట వేయడంతో మురుగు నీరంతా ఇళ్లలోకి చేరి తీవ్ర దుర్వాసనతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. ధర్నాలో కాలనీ ప్రతినిధులు కేవీఎస్ శంకరరావు, నాయుడు, జ్యోతి, కనకేశ్వరి, కృష్ణవేణి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర 'ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్‌గా పెంటిరాజు



గాజువాక, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గాజువాక ప్రాంతానికి చెందిన మొల్లి పెంటి రాజు నియమితులయ్యారు. 75వ వార్డుకు చెందిన పెంటిరాజు ప్రస్తుతం తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆచార్యులు, అధ్యాపకులకు 'ఉత్తమ' అవార్డులు


ఏయూ ఆచార్యులు దుర్గాప్రసాదరావు, జాలాది రవి, వల్లీకుమారి, అధ్యాపకులు రాధ, అరుణ్‌కుమార్,

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ముగ్గురు ఆచార్యులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, అణుభౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు దుర్గాప్రసాదరావు, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు వి.వల్లీకుమారి ఎంపికయ్యారు. అదేవిధంగా డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ గెద్దాడ అరుణ్‌కుమార్, జైలురోడ్డులోని మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండవల్లి రాధ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

గాజువాక, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు పరిధి చైతన్యనగర్ కాలనీలో హైమాస్ట్ లైట్లను గురువారం కార్పొరేటర్ ఏజే స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు, నాయకులు దాసరి విజయసాయి. వీరయ్య, కన్నారావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమానికి విరాళాన్ని అందజేస్తున్న సీఐ

పోలీసులు శాంతి దూతలు: సీఐ సతీశ్‌కుమార్

పెందుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజా రక్షకులతో పాటు శాంతి దూతలని పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ అన్నారు. స్టేషన్ పరిధిలో గల రోడ్లపై సంచరిస్తున్న నిరాశ్రయులైన 45 మందిని పోలీసులు గుర్తించి వారి భద్రత, సంరక్షణ కోసం స్థానిక వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అంతేకాక వృద్ధాశ్రమానికి విరాళాలుగా సేకరించిన రూ.50 వేలను సీఐ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహణతో సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. నిరాశ్రయులను గుర్తించే ప్రక్రియ నిరంతరం ఉంటుందని, అటువంటి వారి సమాచారం ఉంటే ప్రజలు తమకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కరరావు, ఏఎస్ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా పెందుర్తి పోలీసుల సేవానిరతిని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రశంసించారు.

ముగిసిన పారాయణం

పెందుర్తి-రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు పరిధి చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలో గల శ్రీగోపాలకృష్ణ ఆలయంలో 42 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలలితాసహస్రనామ పారాయణ పఠనం గురువారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు, ప్రధాన అర్చకుడు సత్యనారాయణస్వామిల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం 107 కలశాలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

గోపాలపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం సింహాచలం సమీపం అడవివరం వద్ద గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. అప్పట్లో కోరాపుట్ ప్రాంతానికి చెందిన పాంగి సంతోశ్ (35) పరారయ్యాడు. నిందితుడు నగరంలో తిరుగుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు సంతోశ్‌ను అదుపులోకి తీసుకుని గురువారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ

పెదగంట్యాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లిముక్కు స్టేజీ వెనుక ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది గురువారం పునరుద్ధరించారు. బుధవారం రాత్రి పిడుగుపాటు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు పెదగంట్యాడ సబ్ స్టేషన్ అధికారులుగురువారం ట్రాన్స్‌ఫార్మరును పునరుద్ధరించారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 28, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 24, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 46, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 40, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559


చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	121
లైవ్ ధర	141
విత్ స్కిన్	252
స్కిన్‌లెస్	262

కన్నతండ్రే కాలయముడు


ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్ల దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

ముఖ్యమంత్రి రాకకు హెలీప్యాడ్ సిద్ధం

సాగర్‌నగర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ బీచ్‌రోడ్డు రాడిసన్‌లో శుక్రవారం జరగనున్న కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో రుషికొండ బీచ్‌లో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. సీఎం విజయవాడలో హెలీకాప్టర్‌లో బయలుదేరి ఉదయం 8.50 గంటలకు రుషికొండ చేరుకుంటారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్ పరిసరాలను శుభ్రపరిచారు. విద్యుత్ దీపాలు, సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశారు. రిసార్ట్‌కు చేరుకునే మార్గాన్ని యంత్రాలు, పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు.



రుషికొండలో సిద్ధమైన హెలీప్యాడ్

'హోమీబాబా'లో రింగ్ గాంట్రీ లీనియర్ యాక్సిలరేటర్ ప్రారంభం

పవర్ గ్రిడ్ సీఎస్ఆర్ నిధులు 32.5 కోట్లతో ఏర్పాటు

అగనంపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో అత్యాధునిక రింగ్ గాంట్రీ లీనియర్ యాక్సిలరేటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని గురువారం పవర్‌గ్రిడ్ డైరెక్టర్ (పర్సనల్) యతీంద్ర ద్వివేది, ప్రాజెక్ట్ డైరెక్టర్ వంశీరామ్మోహన్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్ మహంతిశెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన, అధునాతన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో సంస్థ రూ.32.5 కోట్లు వెచ్చించి అత్యాధునిక రింగ్ గాంట్రీ లీనియర్ యాక్సిలరేటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ ప్రతినిధులు శివ తపస్య, పాశ్వాన్, రోహిత్ వాస్పానీ, సజల్‌రు, వైద్యులు పాల్గొన్నారు.



పరికరాన్ని ప్రారంభిస్తున్న పవర్ గ్రిడ్ డైరెక్టర్లు

నగరాభివృద్ధికి స్టాండింగ్ కమిటీ కృషిచేయాలి

- తొలి సమావేశంలో మేయర్, కమిషనర్ పిలుపు
- 194 అంశాలకు ఆమోదం.. నాలుగు వాయిదా

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధిలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీదే కీలకపాత్రని మేయర్ శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ తొలి సమావేశం మేయర్ అధ్యక్షతన గురువారం జరిగింది. సభ్యులంతా అజెండాలోని అంశాలపై అధ్యయనం చేసి, లోటుపాట్లు గుర్తించి వివరణ కోరాలని అధికారులకు సూచించారు. అనంతరం అజెండాలోని 198 అంశాలపై చర్చప్రారంభించారు. 194 అంశాలను ఆమోదించిన కమిటీ నాలుగింటిని వాయిదావేసింది. కమిటీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ అజెండాను సభ్యులకు మూడు రోజుల ముందుగానే ఇస్తే అధ్యయనం చేసి, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కృషిచేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇకపై ముందుగానే అందజేయాలని కార్యదర్శి రమణను మేయర్ ఆదేశించారు. నీటి సరఫరా విభాగంలో పైప్‌లైన్ల మరమ్మతులు, వాల్వుల మార్పిడి, ట్రీట్‌మెంట్‌ప్లాంట్లలో నీటి శుద్ధికి వినియోగించే ఆలం కొనుగోలుపై రాపర్తి త్రివేణికన్న అనేక సందేహాలను వ్యక్తంచేశారు. రూ.34 కోట్లతో విభాగం నిర్వహణకే ప్రతిపాదిస్తే, ఏడాదిలో రిపేర్లు, నిర్వహణకు ఇంకెంత ఖర్చుచేస్తారని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ కేతన్‌గార్గ్ సమాధానం ఇస్తూ నీటిసరఫరా నిర్వహణకు ఏటా బడ్జెట్‌లో రూ.40 కోట్లు ప్రతిపాదిస్తామని, అందులో మొత్తాన్ని ఖర్చు చేస్తున్నామన్నారు. ఇంతవరకు కొనుగోలుచేసిన పైప్‌లు, వాల్వ్‌లు ఎన్ని మిగిలాయి, ఎన్నిచోరీకి గురయ్యాయో చూసిన తర్వాత కొత్తగా పరికరాలు కొనుగోలుచేయాలని కన్నా కోరారు. ఇప్పటికీ తమవార్డులో రెండురోజులకు ఒకసారి కొళాయిలు ఇస్తున్నారని ఆ నిధులు ఏమైపోతున్నాయని సభ్యుడు మొల్లి ముత్యాలు ప్రశ్నించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుందని, ఆ అంశాలను ఆమోదించాలని మేయర్ కోరడంతో సభ్యులు అంగీకారం తెలిపారు. రూ.49 లక్షలు వెచ్చించి పారిశుధ్య నిర్వహణకు చీపుర్లు కొనుగోలు అంశంపై పద్మారెడ్డి మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు ఇస్తున్నా వార్డులో చీపుర్లు, పారల కొరత ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. పైగా 2025-26కి ఇప్పుడు కొనుగోలుచేస్తే, ఆరునెలల్లో ఆర్థిక సంవత్సరం ముగిసిపోతుందనే విషయాన్ని అధికారులు ఎందుకు విస్మరించారని మరో సభ్యురాలు శానపతి వసంత ప్రశ్నించారు. చీపుర్లు నాణ్యత లేవని, వాటి కొనుగోలుకు ప్రామాణికం ఏమిటని మేయర్ ప్రశ్నించారు. ఇకపై ఆర్థిక సంవత్సరం వారీగానే కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వివరణ ఇచ్చారు. దుకాణాల అద్దెలు నిర్ణయించడానికి ఏఏ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారో చెప్పాలని సభ్యులు కోరడంతో డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు వివరించారు. పారిశుధ్య నిర్వహణకు బీచ్‌రోడ్డుతోపాటు ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో నియమించిన తాత్కాలిక కార్మికుల వేతనాల చెల్లింపు అంశాలను వాయిదావేశారు. సమావేశంలో జీవీఎంసీ విభాగాధిపతులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ముద్దాయికి జైలు

ఎండాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీలతో మహిళ ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధించిన కేసులో ముద్దాయికి విశాఖ చీఫ్ జ్యుడీషియల్ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.60 వేలు జరిమానా విధించింది. నగరానికి చెందిన మహిళలు ప్రముఖ సంస్థలో పనిచేస్తున్నారు. సుమారు 500 మందికి బాధిత మహిళ క్యారెక్టర్‌పై ఈ-మెయిల్స్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపిచాడు. బాధితురాలు సంస్థ హెచ్‌ఆర్, సైబర్ క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నగరంలోని బుచ్చిరాజుపాలేనికి డబ్బీరు సాయికుమార్‌గా గుర్తించారు. అతడిపై నేరం రుజువు కావడంతో ముద్దాయికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు.

రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతదేహం



ప్రదీప్ (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): అప్పటి వరకు ఇంటి వద్ద గడిపి వెళ్లిన కుమారుడు గంట వ్యవధిలో రైల్వేట్రాక్‌పై విగతజీవిగా పడివున్నాడన్న విషాదకర వార్తతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నాతయ్యపాలేనికి చెందిన జెర్రిపోతుల అప్పలరాజు విద్యుత్ లైన్‌మన్. అతని కుమారుడు జెర్రిపోతుల ప్రదీప్ (23) డిప్లమో పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో వున్నాడు. రైల్వే పరీక్ష రాసేందుకు విజయవాడ వెళ్లి గురువారం ఉదయమే తిరిగివచ్చాడు. పదిగంటల సమయంలో బయటకు వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తల్లి ఫోన్ చేసింది. లిఫ్ట్ చేయకపోవడంతో భర్త అప్పలరాజుకు తెలిపింది. అదే సమయంలో చుక్కవానిపాలెం రైల్వే ట్రాక్‌పై యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడే ఉన్న నాతయ్యపాలెం కాలనీకి చెందినవారు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. రైల్వేలో ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలుస్తాడని ఆశించిన కుమారుడు పుత్ర శోకం మిగిల్చాడని ప్రదీప్ తండ్రి అప్పలరాజు, తల్లి లక్ష్మి విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ప్రదీప్‌ను తలచుకుని అతడి మిత్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రదీప్ కు ఆర్థిక, అనారోగ్య సమస్యలు లేవని ఇలా ఎందుకు చేశాడో తెలియ డం లేదని కుటుంబసభ్యులతో పాటు స్థానికులు, మిత్రులు వాపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడుల పేరుతో దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల పేరుతో నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన వ్యక్తి నుంచి సుమారు రూ.5.25 కోట్లను కొట్టేసిన నేరగాళ్లను సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు ఇచ్చిన బ్యాంకు అకౌంట్ నంబరు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌నకు చెందిన ఖాతాగా గుర్తించారు. ఈ మ్యూల్ అకౌంట్‌కు ఫిర్యాదుదారుడు ఆర్టీజీఎస్ ద్వారా రూ.27 లక్షలు జమచేశారు. సైబర్ నేరగాళ్లు ఆ మొత్తాన్ని పలు ఖాతాలకు మళ్లించారు. ఇందులో తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన గోపీకృష్ణతో పాటు మాతృశ్రీ ల్యాబొరేటరీస్‌లో పనిచేస్తున్న వేణు, స్టార్ ల్యాబొరేటరీస్ ఉద్యోగి నర్మెట్ట జీవన్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాలివి.. ఉషోదయ కూడలి సమీపంలో బుధవారం రాత్రి ఓ కారు రివర్స్ చేస్తుండగా గిడుతూరి సూర్యనారాయణ(54) అనే వ్యక్తిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సూర్యనారాయణ ఆదర్శనగర్ ఎల్‌బీ కాలనీలో ఉంటున్నారు. మృతుడి కుమార్తె శ్రావణ జ్యోతి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆఫీసర్స్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆఫీసర్స్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీని గురువారం కలెక్టర్ హరీంధరప్రసాద్ నియమించారు. క్లబ్ ఉపాధ్యక్షునిగా డాక్టర్ జి.శాంతారావు, వీఎండీఆర్‌ఏ కమిషనర్‌గా కొమ్మి రమేష్‌ను జాయింట్ సెక్రటరీతో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కార్యకలాపాలను సాగిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

